# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 9

ఆదివారం, జూన్ 18, 2023

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## తగ్గేదేలే..! హడలెత్తిస్తున్న ఎండలు

**బహదూర్‌పురా 41.2 డిగ్రీలు.. సాధారణం కంటే నాలుగు డిగ్రీలు అధికం**

**హైదరాబాద్ సిటీ, జూన్ 17 (వాయిస్ టుడే):** నగరంలో ఎండలు దంచికొడుతున్నాయి. సాధారణం కంటే రోజూ రెండు నుంచి నాలుగు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. భగభగ మండుతున్న ఎండలతో నగరవాసులు విలవిల్లాడుతున్నారు. మధ్యాహ్నం సమయంలో నిప్పులు కురుస్తుండడంతో ఇంటి నుంచి కాలు బయట పెట్టేందుకు చాలామంది వణికిపోతున్నారు. శనివారం నగరంలో సాధారణ గరిష్ఠ ఉష్ణోగ్రతలు 37.5 డిగ్రీలుండగా.. పలుచోట్ల నాలుగు డిగ్రీలు అధికంగా రికార్డయింది. అత్యధికంగా బహదూర్‌పురాలోని సులేమాన్‌నగర్, మోండా మార్కెట్‌లో 41.2 డిగ్రీలు నమోదయ్యాయి.





## హరగోపాల్‌పై 'ఉపా' కేసు ఎత్తివేత

- తాడ్వాయి కేసులో మరో ఐదుగురిపైనా
- సీఎం ఆదేశాలతోనే చర్య అని ప్రచారం
- కాసిం, సంధ్య, విమలక్క సహా 146 మందిపై కేసు యథాతథం

2 లో



2 లో

## టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను తొలగించాలి

నియామకాలను పునఃసమీక్షించాలి: రేవంత్



## డిజిటల్ కరెన్సీ నా బలమైన కోరిక

జీఎఫ్‌ఎస్‌టీ సదస్సులో చంద్రబాబు

2 లో



# చేరికల జోరు

# పార్టీలో హుషారు

- హస్తం తీర్థం పుచ్చుకుంటున్న పలువురు నేతలు
- అధికార పార్టీ నేతలు కూడా ఉంటారనే సమాచారం
- కోమటిరెడ్డి కూడా రీ ఎంట్రీ ఛాన్స్!
- ప్రియాంక గాంధీ పర్యటన నాటికి మరింత క్లారిటీ

2 లో

### బీఆర్ఎస్ అసంతృప్త నేతలు కూడా

ప్రస్తుత ఎలక్షన్ మూడ్‌లో కాంగ్రెస్‌కు కలిసొస్తున్న మరో అంశం.. అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు అసంతృప్త నేతలు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ కీలక నేత దామోదర్ రెడ్డి. గుర్నాథరెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైనట్లు సమాచారం. వీరిద్దరి చేరికతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పార్టీ మరింత బలోపేతం అవుతుందని, కేడర్ విస్తరించి వచ్చే ఎన్నికల్లో ముందంజలో నిలుస్తామనే ధీమా కాంగ్రెస్ నేతల్లో కనిపిస్తోంది.

ముక్కుతూ, మూల్గుతూ.. ఒకడుగు ముందుకు.. నాలుగడుగులు వెనక్కి అన్న చందాన.. తంటాలు పడుతున్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులొచ్చాయా? పార్టీ పునర్వైభవం దిశగా అడుగులు వేస్తోందా? కేడర్ లేక ఇబ్బందులు పడుతున్న పార్టీకి ఆ సమస్య తీరనుందా? అంటే.. అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. పార్టీకి మళ్లీ తెలంగాణలో మళ్లీ జోరు పెరుగుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం.. ఇతర పార్టీల్లోని పలువురు కీలక నేతలు హస్తం పంచన చేరేందుకు సిద్ధం కావడమే.

– హైదరాబాద్,

### వాళ్లిద్దరిపై క్లారిటీ

బీజేపీనా, కాంగ్రెస్‌నా.. అంటూ.. ఇంత కాలం ఆలోచిస్తూ.. అటు బీజేపీ నేతల నుంచి, ఇటు కాంగ్రెస్ నేతల నుంచి ఆఫర్ల మీద ఆఫర్లు అందుకుంటున్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులు కాంగ్రెస్‌లో చేరడంపై క్లారిటీ వచ్చేసింది. వీరు కాంగ్రెస్‌లో చేరేందుకు ముహూర్తం కూడా నిర్ణయించుకున్నట్లు సమాచారం. అమెరికా పర్యటలో ఉన్న రాహుల్ గాంధీ తిరిగి రాగానే ఆయన సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీంతో.. ఖమ్మం, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పార్టీ మరింత విస్తరించి.. కేడర్ బలోపేతం అవుతుందనే అభిప్రాయం కాంగ్రెస్ నేతల్లో కనిపిస్తోంది. ఈ ఇద్దరు నేతలతో పాటు వారి జిల్లాల నుంచి వందల సంఖ్యలో నేతలు కాంగ్రెస్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది.

### ఆ నేత కూడానా

ఇతర పార్టీల నుంచి పలువురు కీలక నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్న నేపథ్యంలో మరో ఆసక్తికర చర్చ కూడా జరుగుతోంది. రంగారెడ్డి జిల్లాలో కీలకంగా ఉన్న పట్నం మహేందర్ రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే.. కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుల్లో ఒకరైన పట్నం మహేందర్ రెడ్డి.. బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌లో చేరతారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కానీ.. బీఆర్ఎస్‌లో నెలకొన్న తాజా పరిస్థితులు, సీనియర్ల విషయంలో అనుసరిస్తున్న కొన్ని కారణాలతో పట్నం మహేందర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా.. రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ.. పట్నం మహేందర్‌రెడ్డికి బద్ధ వ్యతిరేకిగా ఉన్న కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మాత్రం పట్నం మహేందర్‌రెడ్డిని చేర్చుకునే విషయంలో అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

### రాజగోపాల్ రెడ్డి రీ ఎంట్రీ ఇస్తారా?

కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు ఆసక్తి కరంగా మారిన మరో చర్చ.. కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్‌లోకి రీ ఎంట్రీ ఇస్తారా? అనేది. తాజాగా ప్రియాంక గాంధీని కలిసిన రాజగోపాల్ రెడ్డి సోదరుడు వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... 'ఎవరైనా కాంగ్రెస్‌లోకి వస్తారు' అని రాజగోపాల్ రెడ్డి విషయంలో అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వడం మరింత ఆసక్తికరంగా మారింది. వాస్తవానికి బీజేపీలో చేరి మునుగోడు ఉప ఎన్నికల్లో పరాజయం పాలైన రాజగోపాల్ రెడ్డికి.. ఆ పార్టీలో తనకు సరైన ప్రాధాన్యం దక్కట్లేదనే భావనలో ఉన్నట్లు ఆయన అనుచరుల నుంచి వినిపిస్తున్న మాట. బీజేపీ నాయకుడిగా ఉన్నప్పటికీ.. ఆయన యాక్టివ్‌గా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న దాఖలాలు లేవు. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకుంటే.. ఆయన సొంత గూటికి చేరే అవకాశాలు మెండుగా ఉన్నాయనే అభిప్రా యాలు సైతం వినిపిస్తున్నాయి. ఈ విషయంపైనా కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రియాంక గాంధీల మధ్య చర్చ జరిగిందనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి.



## మణిపూర్‌లో మూక దాడులు

2 లో

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్యే ఇళ్ల వద్ద ఉద్రిక్తత



## టీఎస్‌పీఎస్సీ కేసీఆర్ జేబుసంస్థ

### వైఎస్ఆర్టీపీ అధినేత్రి షర్మిల

**హైదరాబాద్, జూన్ 17:** టీఎస్‌పీఎస్సీ కేసీఆర్, కేటీఆర్‌ల జేబుసంస్థ అని మరోసారి తేలిపోయిందని వైఎస్ఆర్టీపీ అధినేత్రి షర్మిల అన్నారు. అయినవాళ్లకు పదవులు కట్టబెట్టి, కొలువులు అమ్ముకోవడమే కేసీఆర్, కేటీఆర్ లక్ష్యమని ఓ ట్వీట్‌లో ఆరోపించారు. రెండు నెలలుగా దర్యాప్తు పేరుతో ఊగిసలాడుతున్న 'సిట్'.. టీఎస్‌పీఎస్సీ సభ్యుల నియామకం అక్రమమని హైకోర్టు చెప్పేదాకా ఎందుకు తేల్చలేదని ప్రశ్నించారు.



2 లో

## ఏసీబీ వలలో వీసీ

- తెలంగాణ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ దాచేపల్లి రవీందర్‌గుప్తా అరెస్టు
- తార్నాకలోని నివాసంలో లంచం
- ఉన్నతస్థాయి నిర్ణయంతోనే ఉచ్చు?
- దగ్గరి వ్యక్తుల ద్వారానే తతంగం!
- వర్సిటీలో కీలక పత్రాల స్వాధీనం

# ఎలాంటి వివక్ష లేదు..

**గత తొమ్మిదేళ్లలో తెలంగాణకు గణనీయంగా నిధులు ఇచ్చాం: కిషన్‌రెడ్డి**



- రిపోర్ట్ టు పీపుల్ పేరిట పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన కేంద్ర మంత్రి
- శాఖలు, రంగాలవారీగా వివిధ రూపాల్లో అందజేసిన నిధులపై వివరణ
- అభివృద్ధి సంక్షేమానికి రూ.4.99 లక్షల కోట్లు ఇచ్చాం
- కేంద్ర పన్నుల వాటా కింద రూ.1.78 లక్షల కోట్లు
- రాష్ట్రానికి కేంద్ర సంస్థల రుణాలు రూ.7.5 లక్షల కోట్లు.. ఆర్‌బీఐ అదనపు సాయం రూ.2.31 లక్షల కోట్లు

2 లో

**హైదరాబాద్ సిటీ, జూన్ 17(వాయిస్ టుడే):** కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై ఎలాంటి వివక్ష చూపడం లేదని.. వివిధ రూపాల్లో రాష్ట్రానికి గణనీయంగా నిధులు అందాయని కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మోదీ అన్ని రాష్ట్రాలకూ ప్రధానమంత్రి అని, ఏ రాష్ట్రానికీ తక్కువ నిధులు ఇవ్వలేదని చెప్పారు. కొన్ని రంగాలు, పథకాలు, కేటాయింపులను పరిశీలిస్తే.. ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణకే అధిక కేటాయింపులు దక్కాయన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనలో గుజరాత్ కన్నా తెలంగాణకే ఎక్కువ నిధులు కేటాయించారని చెప్పారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి కేంద్రం అనేక విధాలుగా సహకారాన్ని అందిస్తోందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో.. గత తొమ్మిదేళ్లలో తెలంగాణకు వివిధ శాఖలు, రంగాలవారీగా వివిధ రూపాల్లో అందజేసిన నిధులు, రుణాలు, వివిధ సంస్థలకు చేసిన కేటాయింపుల వివరాలను కిషన్‌రెడ్డి విడుదల చేశారు. ఈ మేరకు 'రిపోర్ట్ టు పీపుల్' పేరిట వీడియోతోపాటు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

### ప్రభుత్వానికో, పార్టీకో వ్యతిరేకం కాదు

తనది రాజకీయ పార్టీ కార్యక్రమమో, ఒక ప్రభుత్వానికో, పార్టీకో వ్యతిరేకంగా ఇచ్చిన ప్రజెంటేషనో కాదని.. తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలను తెలియజేయడమే ముఖ్య ఉద్దేశ్యమని కిషన్‌రెడ్డి తేల్చి చెప్పారు. తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలను అధికారిక డాక్యుమెంట్ల ద్వారా రాష్ట్ర ప్రజల పరిశీలనకోసం అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. కేంద్రం ఇంత చేస్తున్నా ఏమీ చేయడం లేదంటూ రాష్ట్రంలో కొందరు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందేందుకు అండగా నిలుస్తామన్నారు.

### కిషన్‌రెడ్డి ప్రజెంటేషన్‌లో పేర్కొన్న గణాంకాలివీ..

- కేంద్రం తెలంగాణకు పన్నుల వాటా రూపంలో ఇచ్చిన నిధులు రూ. 1.78 లక్షల కోట్లు
- కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో చేసిన ఖర్చు రూ. 4.99 లక్షల కోట్లు
- వేస్ అండ్ మీన్స్ అలవెన్సులు, ఓడీలు, ఇతర మార్గాల ద్వారా రాష్ట్రానికి అనేక సార్లు ఆర్‌బీఐ అందించిన సహకారం రూ. 2.31 లక్షల కోట్లు
- తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు కోసం కేంద్రం చేసిన ఖర్చు (ఉత్పత్తుల సేకరణ, కనీస మద్దతుధర వంటివి) రూ. 1.58 లక్షల కోట్లు
- 2017లో జీఎస్టీ ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రానికి పరిహారంగా అందినది రూ. 8,379 కోట్లు. 2020%--%22 మధ్య (కరోనా కాలంలో) ఇచ్చిన రూ. 6,950 కోట్ల రుణం (దీనిని కేంద్రమే భరిస్తుంది) కూడా కలిపితే రూ. 15,329 కోట్లు.



## అవన్నీ అబద్ధాలే

**కిషన్‌రెడ్డికి కన్ఫ్యూజన్ ఎక్కువ.. కాన్సంట్రేషన్ తక్కువ**

**త్వరలో కౌంటర్ ప్రజెంటేషన్ ఇస్తాం: మంత్రి హరీశ్‌రావు**

2 లో

# బీజేపీ, కాంగ్రెస్ నేతలు రాబందులు

**రాష్ట్రాన్ని వారి చేతుల్లో పెట్టొద్దు. ఆగం కావొద్దు.. ఆలోచించి ఓటు వేయాలి**

- కాంగ్రెస్ చేసింది శూన్యం.. బీజేపీ మత పార్టీ
- దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తే వారికేం నొప్పి?
- నవంబరులో ఎన్నికలు.. కేసీఆర్ హ్యాట్రిక్ పక్కా
- 'పీఎం మిత్ర'కు కాకతీయ టెక్స్‌టైల్ పార్కే స్ఫూర్తి
- ప్రపంచ టెక్స్‌టైల్స్ రంగంలో వరంగల్‌కు స్థానం
- వస్త్రపరిశ్రమలో 99 శాతం ఉద్యోగాలు స్థానికులకే
- భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్లు ఇస్తాం
- కొరియా సంస్థ ద్వారా తొలిదశలో 4 యూనిట్లు
- సెప్టెంబరు – అక్టోబరులో ప్రారంభం: కేటీఆర్
- టెక్స్‌టైల్ పార్కులో 'యంగ్ వన్' సంస్థ భూమిపూజ
- వరంగల్ కలెక్టరేట్ నిర్మాణానికి శంకుస్థాపన



**వరంగల్‌లో కేటీఆర్ విస్తృత పర్యటన మంత్రి కేటీఆర్ శనివారం వరంగల్ జిల్లాలో సుడిగాలి పర్యటన చేసి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గీసుగొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో యంగ్‌వన్ కంపెనీ రూ.840 కోట్లతో నిర్మించే వస్త్ర పరిశ్రమలకు శంకుస్థాపన చేసి, మొక్కలు నాటారు.**

**వరంగల్, జూన్ 17(వాయిస్ టుడే):** కాంగ్రెస్, బీజేపీ నేతలు రాష్ట్రాన్ని పీక్కుతినే రాబందులు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణను వారి చేతుల్లో పెట్టొద్దని.. ఆగం కాకుండా ఆలోచించి ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణకు కాంగ్రెస్, బీజేపీ చేసింది శూన్యం అని విమర్శించారు. 55 ఏళ్ల పాలనలో రాష్ట్రానికి కాంగ్రెస్ ఏమీ చేయలేదని, అదో దద్దమ్మ పార్టీ అని మండిపడ్డారు. ప్రధాని మోదీ అసమర్థ, అవినీతి ప్రధాని అని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి జరగడంతో దశాబ్ది ఉత్సవాలు జరుపుకొంటుంటే వారికేం నొప్పి అని మండిపడ్డారు. సిలిండర్ ధర రూ. 1200కు పెరిగిందని.. ఉప్పు, పప్పుల రూపంలో నిత్యావసరాలూ పెరిగాయని.. ఆ రకంగా మోదీ ప్రియమైన ప్రధాని కాదని, పిరమైన ప్రధాని అని ఎద్దేవా చేశారు. బీజేపీ మతకల్లోలాలు సృష్టించే పార్టీ అని ఆరోపించారు. మాట్లాడితే హిందూ-ముస్లిం అని ఇండియా-పాకిస్థాన్ అని మత విద్వేషాలు రెచ్చగొడుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నవంబరులో రాష్ట్ర అసెంబ్లీ 2వ పేజీలో

# బీజేపీ, కాంగ్రెస్ నేతలు రాబందులు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలు జరుగుతాయని, కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారని చెప్పారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారనేది రాష్ట్ర ప్రజలకే కాదు.. దేశంలో ఎక్కడి వారికైనా తెలుసునని అన్నారు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో 261 ఎకరాల్లో రూ.900 కోట్ల పెట్టుబడితో కొరియాకు చెందిన 'యంగ్‌వన్' కంపెనీ 11 యూనిట్లను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు శనివారం జరిగిన భూమిపూజకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో రిప్లబిక్ కొరియా అంబాసిడర్ ఛాంగ్‌జీ బాక్, యంగవన్ సంస్థ చైర్మన్ కీహాక్ సంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, వివిధ శంకుస్థాపన సందర్భంగా అజాంజాహి మిల్లు గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభలో, మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ మనసులో నుంచి వచ్చిన వివిధ సంక్షేమ పథకాలను రాష్ట్రంలో ప్రవేశపెట్టి, అమలు చేసి ఆచరిస్తోంటే, కేంద్రప్రభుత్వం ఆ పథకాలను కాపీ కొట్టి, పేరు మార్చుకుని అనుసరిస్తోందని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'పీఎం మిత్ర'కు రాష్ట్రంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కే స్ఫూర్తి అన్నారు. టెక్స్‌టైల్ పార్కు కోసం భూములిచ్చిన రైతులకు పాదాభివందనం చేస్తున్నానని, వారి మేలు జన్మలో మరువలేనిదని పేర్కొన్నారు. వరంగల్ వస్త్ర పరిశ్రమలో 99 శాతం స్థానికులకే ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేశారు. 80 శాతం స్థానిక మహిళలకే ఉపాధి అవకాశాలను కల్పించడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. దుస్తుల తయారీ ఫ్యాక్టరీతో కాలుష్యం వస్తుందని ప్రభుత్వాన్ని కొందరు సన్నాసులు బద్నాం చేస్తున్నారని, ఇప్పటికైనా వారు సోయి తెచ్చుకోవాలన్నారు. కొన్ని పార్టీల నేతలు చిల్లరమల్లర మాటలు మాట్లాడితే ఊరుకోవొద్దని, అందుకు తగిన సమాధానం చెప్పాలని బీఆర్‌ఎస్ నేతలకు సూచించారు. ఏది మాట్లాడినా చెల్లుతుందని అనుకునేవారితో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. ప్రజల్లో ఆందోళనను రేకెత్తించేలా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సబ్జెక్టు తెలియకుండా మాట్లాడతారని చురకటించారు. రాష్ట్రానికి వస్త్ర పరిశ్రమ రాదని, తెలంగాణ సర్కారు 'పీఎం మిత్ర'కు సహకరించడం లేదని అవాకులు చెవాకులు మాట్లాడతారని విమర్శించారు. వస్త్ర పరిశ్రమ పార్కుకు కేంద్రం రూ.500 కోట్ల సాయం చేస్తామని చెప్పి, బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించిందని విమర్శించారు. ఇప్పటికే తమ ప్రభుత్వం వరంగల్‌లో రూ.1200 కోట్ల మేర ఖర్చుచేశామని, మరోచోట 'పీఎం మిత్ర'ను వాడుకోవాలని చూస్తున్నామని చెప్పారు.



### అంతర్జాతీయ మార్కెట్‌లో టైక్స్‌టైల్స్ పార్క్

వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌ను ప్రపంచ దేశాలు అబ్బురపడేలా తీర్చిదిద్దుతామని, అంతర్జాతీయ వస్త్ర పరిశ్రమ మార్కెట్‌లో వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ స్థానం కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన పత్తి పండుతుండటం వల్లే సీఎం కేసీఆర్, వరంగల్‌లో టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. 2016లో మొదటిసారి కొరియా కంపెనీ 'యంగ్ వన్'తో కలిసి పార్కు కోసం ఒప్పించామని, కరోనా కారణంగా ఫ్యాక్టరీ పనులు ఆగాయని చెప్పారు. సెప్టెంబరు లేదా అక్టోబరులో నాలుగు యూనిట్లను సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని తెలిపారు. 'యంగ్ వన్' సంస్థ మొదటి దశలో నాలుగు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయడం వల్ల 6 వేల మందికి ఉద్యోగాలు రాబోతున్నాయని, మరో 7 ఫ్యాక్టరీల ద్వారా చాలా మందికి కొలువులు వస్తాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ హంగులతో ప్రపంచంలోని అన్ని దేశాలకు ఇక్కడి వస్త్రాలు సరఫరా అవుతాయని.. మేడిన్ వరంగల్, మేడిన్ పరకాల, మేడిన్ కాకతీయ అనే పేర్లతో ఎగుమతి చేస్తామని తెలిపారు. యంగ్ వన్‌లో తయారయ్యే దుస్తులు ప్రపంచంలోని అన్ని మార్కెట్లకు సరఫరా కావడంతో రాష్ట్రానికి మంచిపేరు వస్తుందన్నారు. యంగ్ వన్ సంస్థ చైర్మన్‌కు పెద్దపెద్ద ఫ్యాక్టరీలు వివిధ దేశాల్లో ఉన్నాయన్నారు. వాటితో పాటుగా కొరియన్ టెక్స్‌టైల్స్ కంపెనీలకు యంగ్ వన్ చైర్మన్ కీహాక్‌సంగ్ అక్కడి వస్త్రపరిశ్రమల సంస్థలకు అధ్యక్షుడిగా పని చేశారన్నారు. అలాంటి వ్యక్తే వరంగల్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా తెలంగాణ అభివృద్ధి ప్రపంచ దేశాలకు తెలిసే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యవసాయంతో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు మన రాష్ట్రంలో ఉండటంతో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు సానుకూల వాతావరణం ఎంత ఉందో కొరియా కంపెనీ ద్వారా ప్రపంచ దేశాలకు తెలియాలన్నారు. అనంతరం మీడియా చిట్‌చాట్‌లో మంత్రి కేటీఆర్, వరంగల్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను త్వరలో పూర్తిచేసి, వచ్చే 2నెలల్లో పనులు మొదలు పెట్టనున్నట్లు పేర్కొన్నారు. కాగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయడంలో సహకరించిన వరంగల్ ప్రజల రుణం తీర్చుకుంటామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి అన్నారు.

### కొండా దంపతులపై విమర్శ

పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై నిలబడడానికి విపక్షాలు భయపడుతున్నాయని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. ధర్మారెడ్డిని చూస్తే మీసాలు తిప్పినోళ్లు భయపడి ఈ రోజు పక్కకు పోతున్నారని, గుండా గిరి, రౌడీయిజం చేస్తే ఎవరూ భయపడరంటూ పరోక్షంగా కొండా దంపతులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. నియోజకవర్గాలను మార్చుకుంటూ పోయేవారు పెద్దపెద్ద నాయకులమని అనుకుంటూ ఉంటారని.. అది ప్రజలు గమనిస్తారని తెలిపారు. ప్రజలను కడుపులో పెట్టుకోవాలని, దబాయించి పనులు చేయించుకుంటామని అనుకుంటే ఎవరూ వినరని స్పష్టం చేశారు.

### 10వేల మందికి ఉపాధి: కొరియా రాయబారి

వరంగల్‌లో కొరియా కంపెనీ ఏర్పాటు చేసిన 'యంగ్ వన్' వస్త్రపరిశ్రమ ప్రపంచం లో అత్యుత్తమ వస్త్ర పరిశ్రమగా రూపొందాలని కొరియా రాయబారి ఛాంగ్‌జీ బాక్ ఆకాంక్షించారు. యంగ్ వన్ సంస్థ కొరియాలో ట్రెండ్ సెట్టర్‌గా పేరున్న సంస్థ అని, అలాంటి సంస్థ వరంగల్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలతో పాటుగా, జీవన ప్రమాణాలు కూడా పెరుగుతాయన్నారు. వరంగల్ వస్త్ర పరిశ్రమలో 'యంగ్‌వన్' ద్వారా పదివేల మంది ఉపాధి అవకాశాలు రానున్నాయని చెప్పారు. అనంతరం యంగ్‌వన్ సంస్థ చైర్మన్ కీహాక్ సంగ్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం మరువలేనిదని, మొదటి దశలో నాలుగు యూనిట్ల ద్వారా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు.

## టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను తొలగించాలి

**హైదరాబాద్, జూన్ 17(వాయిస్ టుడే):** ప్రశ్నపత్రాల లీకేజీకి కారణమైన టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను, సభ్యులను తక్షణమే తొలగించాలని, అన్ని నియామకాలనూ పునఃసమీక్షించాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ సభ్యుల నియామకాలపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ప్రభుత్వానికి చెంపపెట్టు అని అన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలో కోట్ల రూపాయలు చేతులు మారాయని, దీనిపై ఇప్పటికే ఈడీ కేసు కూడా నమోదైందని చెప్పారు. సీబీఐ కేసు కూడా నమోదు చేసి విచారణ చేపట్టాలన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీకి కారణమైన మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయా లన్నారు. గాంధీ భవన్‌లో శనివారం బెల్లంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కర్ణాటకలో కాంగ్రెస్‌ను చీల్చేందుకు బీజేపీ, కేసీఆర్ కలిసి ప్రయత్నించారని, అక్కడ కాంగ్రెస్‌ను ఓడించేందుకు రూ.వందల కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. అయితే కర్ణాటక ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చి బీజేపీని బండకేసి కొట్టారన్నారు. కర్ణాటకలో బీజేపీకి, తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు పెద్ద తేడా లేదన్నారు. అక్కడ బీజేపీది 40% కమీషన్ సర్కారు అయితే ఇక్కడ బీఆర్‌ఎస్‌ది 30 శాతం కమీషన్ సర్కార్ అని విమర్శించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గురించి మాట్లాడేందుకు తనకే సిగ్గనిపి స్తోందని, పక్కన కూర్చోపెట్టుకోవడానికి కేసీఆర్‌కు ఏమీ అనిపించట్లేదా అని ప్రశ్నించారు.

## హరగోపాల్‌పై 'ఉపా' కేసు ఎత్తివేత

**హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'ఉపా' కేసు విషయంలో ప్రభుత్వం కాస్త వెనక్కి తగ్గింది. కేసు నుంచి ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు ఆరుగురి పేర్లను తొలగించాలని నిర్ణయం తీసుకుంది. ఉపా కేసులో నిందితులుగా ఉన్న ప్రొఫెసర్ హరగోపాల్, పద్మజా షా, రఘునాథ్, గడ్డం లక్ష్మణ్, గుంటి రవీందర్, సురేష్ కుమార్‌లకు వ్యతిరేకంగా సాక్ష్యాలు లభించలేదని ములుగు ఎస్పీ ప్రకటించారు. ఈ దృష్ట్యా వారి పేర్లను కేసు నుంచి తొలగించాలంటూ కోర్టులో మెమో ఫైల్ చేస్తామని తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతుందని, మరిన్ని సాక్ష్యాలను సేకరించిన తర్వాత సమాచారాన్ని బయటపెడతామని వివరించారు. అయితే, కేసులోని మిగతావారి విషయంలో ఎస్పీ స్పష్టతనివ్వలేదు. దీంతో ప్రొఫెసర్ కాశీం, పీవోడబ్ల్యూ నేత సంధ్య, విమలక్క సహా 146 మందిపై కేసు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఉపా కేసుకు సంబంధించి శనివారం ములుగు ఎస్పీ ఒక ప్రకటన విడుదల చేశారు. 2022 ఆగస్టు 19న ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని బీరెల్లి సమీపంలో మావోయిస్టు నేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్, ఇతర మావోయిస్టులు సమావేశమవుతున్నట్లు సమాచారం అందడంతో ములుగు పోలీసులు కూంబింగ్ చేపట్టారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, అమాయక గిరిజన యువతను దళంలో చేర్చుకోవడం.. అధికారులు, అమాయక పౌరులను హత్య చేయడం, నిధుల సేకరణ వంటి లక్ష్యాలతో ఈ సమావేశం జరిగింది. అయితే, పోలీసుల రాకతో వారంతా పారిపోయారు. పస్రా సీఐ ఫిర్యాదు మేరకు అక్కడ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. ఐపీసీ 120బీ, 147, 148 రెడ్ విత్ 149.. 'చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా)'లోని సెక్షన్లు 10, 13, 18, 20, 38, ఆయుధాల చట్టంలోని సెక్షన్ 25(1-బి)(ఎ)ల కింద తాడ్వాయి పోలీసులు 152 మందిపై కేసు నమోదు చేశారు. మావోయిస్టు నేతలు, వారి సానుభూతిపరులు, సమావేశ స్థలం వద్ద లభించిన సాహిత్యంలో ఉన్న ఇతరుల పేర్లపై కేసులు నమోదు చేశారు.

## డిజిటల్ కరెన్సీ నా బలమైన కోరిక

**హైదరాబాద్, జూన్ 17(వాయిస్ టుడే):** డిజిటల్ కరెన్సీ రావాలనేది తన బలమైన కోరిక అని టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టైయినబుల్ ట్రాన్స్‌ఫార్మేషన్ (జీఎఫ్ఎస్‌టీ) సంస్థ శనివారం 'డీప్ టెక్నాలజీస్' అంశంపై నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందర్భంగా ఆయన పలు అంశాలపై ప్రసంగించారు. "సమర్థమైన నాయకత్వంతోనే కుటుంబంలో అయి నా.. రాష్ట్రంలో అయినా, దేశంలో అయినా మార్పు తీసుకురాగలం. మంచి వ్యక్తులు రాజకీయాల్లోకి రావాలి. అన్ని వర్గాల ప్రజలు ఓటు వేయాలి. తద్వారా దేశానికి మంచి నాయకత్వం లభిస్తుంది. మంచి ఫలితాలు వస్తాయి. ప్రస్తుతం సాంకేతిక రంగం శరవేగంగా పురోగమిస్తోంది. దీన్ని అందరూ పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. పేదరిక నిర్మూలనకు సాంకేతికతను ఎలా ఉపయోగించవచ్చు అనేదానిపై చర్చ జరగాలి. నేను మొదటిసారి సీఎం అయినప్పుడే ఐటీ రంగంలో భవిష్యత్తు అవకాశాలను గుర్తించాను. హైదరాబాద్‌లో హైటెక్ సిటీని నిర్మించాను. ప్రపంచవ్యాప్తంగా పర్యటించి ప్రముఖ సంస్థల ప్రతినిధులతో మాట్లాడి, భారతీయుల సామర్థ్యం గురించి ప్రచారం చేశాను. అదే సమయంలో ట్రిపుల్ ఐటీ సహా పెద్ద సంఖ్యలో ఇంజనీరింగ్ కాలేజీలు ప్రారంభించాను. తద్వారా పెద్ద ఎత్తున ఐటీ రంగ నిపుణులు అందుబాటులోకి వచ్చారు. మెరికల్లాంటి మన యువత దేశ విదేశాలకు వెళ్లి ప్రతిభను చాటుతున్నారు" అని అన్నారు.

## ఏసీబీ వలలో వీసీ

**హైదరాబాద్ సిటీ/తార్నాక, నిజామాబాద్, జూన్ 17 (వాయిస్ టుడే):** తెలంగాణ విశ్వవిద్యాలయంలో వీసీ వర్సెస్ ఈసీ సభ్యులు అన్నట్లుగా రెండు నెలలుగా జరుగుతున్న వివాదం కీలక మలుపు తీసుకుంది. ఈసీతో పొసగకుండా, సమావే శాలకు హాజరవ్వకుండా వివాదాస్పద రీతిలో వ్యవహరిస్తున్న తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ దాచేపల్లి రవీందర్ గుప్తా ఏసీబీకి చిక్కారు. అదనపు పరీక్ష కేంద్రానికి అనుమతిచ్చేందుకు శనివారం ఉదయం హైదరాబాద్‌లోని తన నివాసంలో రూ.50వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. హైదరాబాద్‌లో ఈసీ మీటింగ్ జరిగే రోజే ఆయన అరెస్టు కావడం తెలంగాణ వర్సిటీలో తీవ్ర కలకలం సృష్టించింది. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా, ఆర్మూర్‌లోని శ్రీషిర్డీ సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు దాసరి శంకర్‌కు చెందిన కళాశాలలో అదనపు పరీక్ష కేంద్రం ఏర్పాటుకు అనుమతి కోసం రవీందర్ గుప్తా లంచంగా రూ. 50వేలు డిమాండ్ చేశారు. దీంతో ఈ నెల 14న దాసరి శంకర్ ఏసీబీ అధికారులకు పిర్యాదు చేశారు. ఏసీబీ అధికారులు శనివారం ఉదయం తార్నాకలోని గుప్తా నివాసం పరిసరాల్లోకి చేరుకున్నారు. దాసరి శంకర్ నుంచి గుప్తా రూ.50 వేలు తీసుకోగానే ఇంట్లోకి ప్రవేశించారు. మాస్టర్ బెడ్‌రూమ్‌లోని అల్మరాలో దాచిన రూ. 50వేలను గుర్తించారు. చాలాసేపటి వరకు ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఏసీబీకి చెందిన మరో బృందం తెలంగాణ విశ్వవిద్యాలయానికి వెళ్లి తనిఖీలు నిర్వహించింది. హైదరాబాద్‌లో ఉన్న పరీక్షల నియంత్రణ అధికారిని క్యాంపస్‌కు పిలిపించి వివరాలను సేకరించారు. గుప్తాను అరెస్టు చేసి ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టుకు తరలించారు. అంతకుముందు మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు గుప్తా 'నో కామెంట్' అని వ్యాఖ్యానించారు. గుప్తా ఆస్తులపై దర్యాప్తు చేయనున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. కాగా, రెండు నెలలుగా ఈసీ సమావేశాలకు వీసీ హాజరు కావడం లేదు. నిరుడు ఈసీ సభ్యులు తమ సమావేశంలో రిజిస్ట్రార్‌గా నిర్ణయించిన యాదగిరిని నియమించేందుకు గుప్తా అంగీకరించలేదు. నెలరోజులుగా వర్సిటీలో జీతాలతో పాటు ఇతర చెల్లింపులనూ వీసీ నిలిపివేయడంతో ఔట్ సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు ఆందోళనకు దిగారు. చివరకు దిగొచ్చిన వీసీ, యాదగిరిని రిజిస్ట్రార్‌గా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు వీసీ గుప్తా లేకుండానే హైదరాబాద్‌లోని రుసాభవన్‌లో ఈసీ సమావేశం జరిగింది. గతం లో అనుమతులు లేకుండా పని చేసిన ముగ్గురు రిజిస్ట్రార్లపై చర్యలు చేపట్టేందుకు ఈసీ కమిటీ చర్చించింది. పలు సభ్యుల నియామకంపై, పీహెచ్‌డీ అడ్మిషన్లపైనా ప్రత్యేక కమిటీ ద్వారా దర్యాప్తు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. పదోన్నతులకు అర్హులైన ప్రొఫెసర్లకు అవకాశం ఇచ్చేలా కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వాలని, పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయాలని నిర్ణయించారు.

### ఇంచార్జి వీసీని నియమించే అవకాశం

రవీందర్ గుప్తకు వీసీగా రెండేళ్ల సర్వీసు పూర్తయింది. ఇంకా సంవత్సరం సర్వీసు మాత్రమే ఉంది. ఈలోపే ఆయన పట్టుబడడంతో త్వరలోనే ఇన్‌చార్జి వీసీని నియమించే అవకాశాలున్నాయి.

### పథకం ప్రకారమేనా?

వీసీ గుప్తా అరెస్టు వార్త తెలియగానే తెలంగాణ వర్సిటీలో పరిపాలన సిబ్బంది మినహా వివిధ డిపార్ట్‌మెంట్‌లలో ఉన్న ప్రొఫెసర్లు, ఇతర సిబ్బంది వెళ్లిపోయారు. అయితే విద్యార్థి సంఘాలతో పాటు కొన్ని ఉద్యోగ సంఘాల నేతలు మాత్రం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆయన పట్టుబడడం వల్ల విశ్వవిద్యాలయంకు మంచి రోజులు వస్తాయని విద్యార్థి సంఘాల నేతలు ప్రకటించారు. ఉన్నత స్థాయిలో తీసుకున్న నిర్ణయం వల్లే ఏసీబీ వలకు వీసీ చిక్కినట్లు, పథకం ప్రకారం తతంగమంతా ఆయనకు దగ్గరగా ఉన్న వ్యక్తుల ద్వారానే నడిపించినట్లు చెబుతున్నారు. విశ్వవిద్యాలయాల పరిధిలో ఆర్నెల్ల క్రితం డెయిలీ వేజెస్ సిబ్బంది వ్యవహారంలో భారీగా డబ్బులు తీసుకోవడం కూడా ఈ తనిఖీలకు కారణమని చెబుతున్నారు. సిబ్బంది ధర్నాలు చేయడం, విజిలెన్స్ అధికారులకు పూర్తి వివరాలు ఇవ్వడం వల్లే ఏసీబీ అధికారులు తనిఖీలు చేసినట్లు తెలుస్తోంది.

## చేరికల జోరు.. పార్టీలో హుషారు

(మొదటి పేజీ తరువాయి)

ఇదిలా ఉండగా.. ఇప్పటికే తమ పార్టీలో చేరేందుకు సిద్ధమైన నాయకుల పేర్లను ఉటంకిస్తూ.. ఇతర పార్టీల్లోని.. ప్రభావశీలురు, అసంతృప్తులుగా ఉన్న నేతలకు కాంగ్రెస్ నేతలు గాలం వేస్తున్నారు. ముఖ్యంగా బీఆర్‌ఎస్‌లో సిటింగ్ అవకాశాలపై అపనమ్మకంగా ఉన్న నేతలు, పార్టీలో సరైన ప్రాధాన్యం లభించట్లేదని భావిస్తున్న వారిని తమ పార్టీలోకి రావాలని కాంగ్రెస్ నేతలు ఆఫర్లు ఇస్తున్నారు. ఎమ్మెల్యే టికెట్ లేదా గెలిచిన తర్వాత కీలక పదవుల వంటి తాయిలాలను ముందుంచుతున్నట్లు సమాచారం. మరోవైపు బీజేపీ నుంచి కూడా నేతలను ఆకర్షించేందుకు కాంగ్రెస్ వ్యూహాలు పన్నుతోంది. ఈ పార్టీలోనూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల నుంచి చేరి సరైన ప్రాధాన్యం లేదని అంతర్మథనం చెందుతున్న నేతలను గుర్తించి.. సొంతగూటికి రావాలని ఆహ్వానాలు అందిస్తున్నట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా బీజేపీలోకి వలస వెళ్లిన పలువురు నేతలు ఆ పార్టీ అధ్యక్షుడి పోకడలతో ఇమడ లేకపోతున్నారు. దీనిని తమకు అనుకూలంగా మలచుకుని వారిని కాంగ్రెస్‌లోకి తిరిగి రప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

### ప్రియాంక పర్యటన నాటికి చేరికల జోరు..

కాంగ్రెస్ నేతల సమాచారం ప్రకారం.. తెలంగాణలో వచ్చే నెలలో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, సోనియాగాంధీ తనయురాలు ప్రియాంక గాంధీ పర్యటించనున్నారు. ఈ పర్యటన నాటికి పార్టీలో చేరికలు షురూ చేయాలని అదే విధంగా ఆశావహులకు ప్రియాంకగాంధీ ద్వారా హామీలు ఇప్పించాలనే ఉద్దేశం ఆ పార్టీ నేతల్లో కనిపిస్తోంది. ఈ వ్యూహం సాఫీగా అమలైతే కాంగ్రెస్ పార్టీలో వచ్చే నెలలో మరిన్ని చేరికలు ఉంటాయనే మాటలు కూడా వినిపిస్తున్నాయి.

### కీలకంగా రేవంత్.. ఆయన వెనుక డీకే:

కాంగ్రెస్ పార్టీకి పునర్వైభవం తీసుకురావడం, ఇతర పార్టీల నేతలను పార్టీలో చేరేందుకు ఒప్పించడంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఇదే సమయంలో పార్టీ గెలుపు విషయంలో కర్నాటక డిప్యూటీ సీఎం, ఆ రాష్ట్రంలో పార్టీకి ట్రబుల్ షూటర్‌గా గుర్తింపు పొందిన డీకే శివకుమార్ కూడా రంగంలోకి దిగినట్లు సమాచారం. పార్టీ పూర్వ ప్రాభవానికి ఎలాంటి వ్యూహాలు చేపట్టాలి? ఆశావాహులకు.. వలస నేతలకు ఎలాంటి హామీలు ఇవ్వాలి? అనే విషయంలో టీపీసీసీకి మార్గనిర్దేశం చేసేందుకు డీకేకు కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో డీకేతో రేవంత్ సమావేశం కావడం అధిష్టానం సూచన మేరకే అని కూడా తెలుస్తోంది.

### బీఆర్‌ఎస్ జాబితా.. తర్వాత మరింత చేరికలు:

మరోవైపు.. అధికార బీఆర్‌ఎస్ పార్టీ.. వచ్చే ఎన్నికలకు టికెట్ల విషయంలో వచ్చే నెలాఖరులోపు నిర్ణయం తీసుకోనుందని సమాచారం. పార్టీ అధినేతకున్న నమ్మకాల మేరకు శ్రావణమాసంలో టికెట్ల కేటాయింపును ముహూర్తంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆ జాబితాలో చోటు సాధించలేని నేతలు కూడా కాంగ్రెస్‌వైపు దృష్టి మళ్లించడం ఖాయమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే ఇప్పటి వరకు బీఆర్‌ఎస్‌కు తాము మాత్రమే ప్రత్యామ్నాయం అని మాట్లాడుతున్న బీజేపీ జోష్ తగ్గి.. ఆ స్థానంలో కాంగ్రెస్ చేరడం.. ఆ పార్టీకి మంచి రోజులకు సూచనగా పేర్కొనొచ్చని విశ్లేషకులు అంటున్నారు. అయితే ఇదే సమయంలో నేతల చేరిక విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని, గోడ మీద పిల్లులను గుర్తించాలని అంటున్నారు.



## ఆకాశమే హద్దుగా పని చేయండి

**అల్వాల్/హైదరాబాద్, జూన్ 17(వాయిస్ టుడే):** శిక్షణ పూర్తిచేసుకున్న యువ పైలట్లు దేశం అంచనాలకు అనుగుణంగా.. ఆకాశమే హద్దుగా పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. దేశ రక్షణకోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరా డిన వాయుసేన అధికారుల వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శని వారం ఉదయం జరిగిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పరేడ్‌కు సమీక్ష అధికారిగా మొదటి సారి హాజరైన ముర్ము.. కేడెట్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము మాట్లాడుతూ సరిహద్దుల్లోని ఉగ్రవాద స్థావరాలను నాశనం చేయడంలో భారత వాయుసేన ప్రదర్శించిన నైపుణ్యాలు.. భారత్ సత్తా ఏమిటో ప్రపంచానికి చాటాయని తెలిపారు. టర్కీ, సిరియాలో భూకంపం సంభవించి నప్పుడు సాయం అందించేందుకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రంగంలోకి దిగిందన్నారు. ఫైటర్ జెట్లలో పైలట్లుగా మహిళల సంఖ్య పెరుగుతుండడం అభినందనీయమని అన్నారు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. వీరికి రాష్ట్రపతి ముర్ము... వింగ్స్(బ్రెవెట్స్)ను ప్రదానం చేశారు. ఫ్లయింగ్ ఆఫీసర్ నితేష్ ఘూకర్‌కు స్వార్డ్ ఆఫ్ ఆనర్(కరవాలాన్ని) అందజేశారు. కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి సత్యవతి రాథోడ్, చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ మార్షల్ వీఆర్ చౌదరి, సీఎస్ శాంతికు మారి, డీజీపీ అంజనీ కుమార్, మేడ్చల్ కలెక్టర్ అమోయ్ కుమార్ పాల్గొన్నారు. పైలట్ శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో వనపర్తికి చెందిన నిఖిల్ సాయి యాదవ్ ఒకరు. "కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదు వుతున్నప్పుడే ఎయిర్‌ఫోర్స్ వైపు వెళ్లాల నుకున్నా. చదవడం, వ్యాయా మం చేయ డం కష్టంగా అనిపించినా ఫ్లైయింగ్ అంటే ఇష్టంతో అన్నింటిని ఎదుర్కొన్నా. దేశానికి సేవ చేయడం గర్వం గా ఉంది' అని నిఖిల్ సాయి తెలిపారు.

## ఎలాంటి వివక్ష లేదు..

(మొదటి పేజీ తరువాయి)

- కేంద్ర ప్రభుత్వ శాఖల ద్వారా 2014 నుంచి రాష్ట్రానికి వివిధ పథకాలు, అభివృద్ధి పనుల రూపంలో కేటాయించిన/విడుదలైన నిధులు సుమారు రూ.5లక్షల కోట్లు.
- 2014 నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు.. కేంద్రం, దాని ఆధ్వర్యంలోని సంస్థలు, పీఎస్‌యూల ద్వారా అందిన రుణాల మొత్తం (బడ్జెటేతర రుణాలతో సహా) దాదాపు రూ 7.5 లక్షల కోట్లు.
- రాష్ట్ర ప్రజలకు, వివిధ వర్గాలకు కేంద్రం ద్వారా అందించిన రుణాలు దాదాపు రూ.9.26 లక్షల కోట్లు

## అవన్నీ అబద్ధాలే

**హైదరాబాద్, జూన్ 17 (వాయిస్ టుడే):** కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి విడుదల చేసిన నిధులపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శనివారం ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు స్పందించారు. కిషన్ రెడ్డికి కన్ఫ్యూజన్ ఎక్కువ, కాన్సన్‌ట్రేషన్ తక్కువ అని ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఫ్రస్ట్రేషన్‌తో పట్టపగలు పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా 41 శాతమంటూ ఫైనాన్స్ కమిషన్ సిఫారసు చేసినా 30 శాతం మాత్రమే పొందుతున్నా యన్నారు. 'కేంద్ర తన పూల్‌లో భాగం కాని సెస్సులు, సర్‌చార్జీలను విధిస్తోంది. దీంతో రాష్ట్రాలకు పన్నుల వాటాలో అన్యాయం జరుగుతోంది.

## మణిపూర్‌లో మూక దాడులు

**ఇంఫాల్, గువాహటి, జూన్ 17:** ఒకరిద్దరు కాదు.. వందలు, వేలమంది.. మూకుమ్మడి దాడితో విధ్వంసమే లక్ష్యం.. అడ్డుకున్న బలగాల పైకి కాల్పులు.. ఇదీ మణిపూర్‌లో ప్రస్తుతం పరిస్థితి. ఇంఫాల్‌లో శుక్రవారం రాత్రి-శనివారం తెల్లవారుజాము మధ్య ఉద్రిక్తత నెలకొంది. క్వక్తా, కాంగ్వైలో అల్లర్ల నేపథ్యంలో కాల్పులు జరిగాయి.

# గిరిజన తండాలు ప్రగతి వికాస కేంద్రాలు

**ప్రతి తండాలో నవశకం**

**తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్ దే**

**ఐదు తండాలలో సొంత నిధులతో సేవాలాల్ మహారాజ్ దేవాలయాలు**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**నియోజకవర్గంలో ఘనంగా తెలంగాణ గిరిజన దినోత్సవం**

**గిరిజనులతో కలిసి నృత్యం చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్**



అమీన్పూర్ (వాయిస్ టుడే): గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపి తండాలను అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దిన మహోన్నత నాయకుడు సీఎం కేసీఆర్ అని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 16వ రోజున శనివారం అమీన్పూర్ మండలం ఐలాపూర్ తండాలో తెలంగాణ గిరిజన దినోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేసి అందర్నీ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాల మూలంగా ప్రతి గిరిజనుడు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని తెలిపారు. తండాలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్ది పరిపాలనలోను గిరిజనులకు సముచిత స్థానం కల్పించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర రాజధాని నడిబొడ్డున గిరిజనుల ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కిందన్నారు. ప్రతి తండాలో సిసి రోడ్లు, ఇంటింటికి రక్షిత మంచినీరు, వీధి దీపాలు, అంగన్వాడి కేంద్రాలు ప్రాథమిక పాఠశాలలతో తండాలు కళకళలాడుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. విద్యా ఉపాధి రంగాలలో ఉన్నత స్థితికి చేరుకునేలా ప్రతి ఏటా కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు తాండాలలో సొంత నిధులతో సంత్ సేవాలాల్, భవాని మాత దేవాలయాలు నిర్మించడంతోపాటు, వారి ఆర్థిక అభ్యున్నతికి సంపూర్ణ తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా విద్యారంగంలో గిరిజనుల అవకాశాలు పెంపొందించేందుకు ప్రత్యేక గురుకుల పాఠశాలలు కళాశాలు ఏర్పాటుచేసి అత్యుత్తమ విద్యను అందిస్తున్నామని తెలిపారు. గిరిజనుల వికాసానికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ను నిండు మనస్సుతో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో అమీన్పూర్ ఎంపీపీ దేవానందం, జడ్పిటిసి సుధాకర్ రెడ్డి, పటాన్చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, గ్రామ సర్పంచ్ మాధవి రవి, ఎంపీడీవో మల్లీశ్వర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, తండావాసులు పాల్గొన్నారు. దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ తెలిపారు.

## కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధే నా ధ్యేయం

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్ పల్లి, జూన్ 17 (వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధి పరచడమే నా ధ్యేయం అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. నియోజకవర్గం పరిధి బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కే.పి.హెచ్.బి కాలనీ రోడ్ నెంబర్ వన్,15త్ ఫేస్, రాఘవేంద్ర కాలనీ, ముస్కిపేట్ లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కూకట్ పల్లి నియోజకవర్గ అభివృధి ప్రధాత, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు, నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ లో ఉన్న పార్కు, సీసీ రోడ్లు, డ్రైనేజ్, తదితర మౌలిక వసతులు కల్పించేందుకు ఎన్ని నిధులైనన వెచ్చించి అభివృద్ధికి పట్టంటం కడతామని అన్నారు. పెండింగ్లోలో ఉన్న అభివృద్ధిధి పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తానని ఆయన తెలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు సిహెచ్ ప్రభాకర్ గౌడ్, బాలాజీనగర్ డివిజన్ కార్యదర్శి వెంకటేశ్ చౌదరి, పాతురి గోపి, రంగామోహన్, నాగేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, జీవ, ఆనంద్, ఖైళా, శంకర్, కళ్యాణ్, ఏళ్లేశ్, బుచ్చి రాములు, భాస్కర్ రావు, సుశీల్, జగదేవి తదితరులు పాల్గొన్నారు.



## దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్

పటాన్ చెరు(వాయిస్ టుడే): పటాన్ చెరువు మండలం చిట్కుల్ గ్రామం జీటీఎన్ కాలనీలో తన సొంత నిధులతో 2022 ఆగష్టు 11 వ తేదీన భూమి పూజ చేసిన షిరిడి సాయిబాబా దేవాలయ పనులను ఆయన పరిశీలించారు త్వరలోనే షిరిడి సాయిబాబా ఆలయం పనులు పూర్తి చేసి విగ్రహ ప్రతిష్టాపనా మహోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ప్రజల కోసం ఈ దేవాలయాన్ని తన సొంత నిధులతో నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. నియోజవర్గ పరిధిలో ఇప్పటికే చాలా దేవాలయాలకు ఆర్థిక సహాయం పెద్ద ఎత్తున అందించామని భవిష్యత్తులో కూడా మరిన్ని దేవాలయాలకు అందించనున్నామని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పండుగలకు ఉత్సవాలకు పెద్దపీట వేసి రాష్ట్రంలో ఆధ్యాత్మిక భావన పెంచేలా కృషి చేస్తుందని తెలిపారు ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఆదర్శంగా తీసుకుని దేవాలయాల నిర్మాణాలకు సహకారం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు ఎన్ఎంఆర్ యువసేన తరపున ఎప్పుడూ ప్రజలకు అందుబాటులోనే ఉంటానని అన్నివేళలా మీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మురళీ,సుధాకర్, గౌరి శంకర్,నరేష్,ప్రశాంత్, కాలనీ వాసులు,తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్ట్ కుటుంబాల ఆరోగ్య రక్షణకు అండగా రాందేవ్ రావ్ ఆస్పత్రి

కూకట్‌పల్లి, జూన్ 17 :(వాయిస్ టుడే): కూకట్‌పల్లి రాందేవ్ రావ్ ఆస్పత్రిలో జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు 50% రాయితీతో కూడిన వైద్య సదుపాయాలు అందించేందుకుగాను ఆస్పత్రి నిర్వాహకులు సానుకూలంగా స్పందించింది. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం ఆస్పత్రి హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కల్నాల్ కమలాకర్ ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ కూకట్ పల్లి, కుత్బుల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న జర్నలిస్టుల కుటుంబాలకు ఆరోగ్యపరమైన రక్షణ కల్పించాలని రాందేవ్ ఆస్పత్రి హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కల్నాల్ కమలాకర్, అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ యోబులను కోరారు. సమాజానికి సేవ చేయడంలో జర్నలిస్టులు తమ ఆరోగ్యాలను సైతం పనంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సేవ చేస్తున్న జర్నలిస్టుల కుటుంబాలకు మెరుగైన వైద్య సదుపాయాలను కలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆస్పత్రిలో ఓపి విభాగంతో పాటు, ల్యాబ్, ఇన్ పేషంట్, శస్త్ర చికిత్సలకు 50 శాతం రాయితీ కల్పించాలని కోరారు. ఇందుకు స్పందించిన హెల్త్ డైరక్టర్ డాక్టర్ కల్నాల్ కమలాకర్ మాట్లాడుతూ జర్నలిస్టులకు తప్పకుండా రాయితీతో కూడిన వైద్య సదుపాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. జర్నలిస్టుల కుటుంబాలకు కూడా అన్ని రకాల సదుపాయాలను ఆస్పత్రిలో రాయితీతో కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాందేవ్ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులో ఉంచామని తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురానున్నామని పేర్కొన్నారు. కూకట్ పల్లి, కెపిహెచ్బి, బాలానగర్, ఎల్లమ్మబండ, జగద్గిరిగుట్ట, గాజులరామారం ప్రాంతాలకు చెందిన సామాన్యులకు ఆస్పత్రిలో మెరుగైన చికిత్సలను అందిస్తున్నామని తెలిపారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ యోబు మాట్లాడుతూ ఓపితోపాటు, ల్యాబ్, ఇన్ పేషంట్, శస్త్ర చికిత్సలకు రాయితీలు వర్తించేలా తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కుటుంబ సభ్యులకు సంబంధించిన అందరి వివరాలు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డులు, దరఖాస్తులు అందించాలని సూచించారు. వీటిని పరిశీలించి జర్నలిస్టు కుటుంబ సభ్యులకు రాయితీ కార్డులను అందజేస్తామని తెలిపారు. 400 మంది విలేకరుల వరకు రాయితీ కార్డులను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కరీం, వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్ రెడ్డి, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు గంగరాజు, కుతుబులాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కోటగడ్డ శ్రీనివాస్, కోశాధికారి శేషారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు శ్రీధర్, నాగరాజు, రామారావు, నవీన్, చంద్ర, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గిరిజనోత్సవం



బోడుప్పల్, జున్ 18 (వాయిస్ టుడే ): బోడుప్పల్ నగర పాలక సంస్థ యందు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన గిరిజనోత్సవం కార్యక్రమం మేయర్ సామల బుచ్చిరెడ్డి అధ్యక్షతన దేవి ఫంక్షన్ హాల్ యందు గిరిజనుల సమక్షంలో ముందుగా బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ కు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం తో మొదలై బంజారా సోదరీ మణుల నృత్యాలతో సభా ప్రాంగణం పండుగ వాతావరణంలా కనిపించింది. ప్రభుత్వం గిరిజనులకు ఇంత ప్రాధాన్యత ఇవ్వటం చాలా సంతోషం అని హర్షం వ్యక్తం చేశారు. మరియు బంజారాలకు కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలనీ విన్నవించగా మంత్రి మల్లారెడ్డి గారి సహకారంతో 1 ఎకరం స్థలం కేటాయించేలా చూస్తామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్, మరియు గిరిజనుల తరపున కార్యక్రమం దగ్గరుండి నిర్వహించిన కార్పొరేటర్ సుమన్ భూక్య మరియు కొత్త చందర్ గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, కొత్త శ్రీవిద్య చక్రపాణి, సీసా వెంకటేష్ గౌడ్ మరియు కో అప్షన్ సభ్యులు రంగా బ్రమ్మన్న, మున్సిపల్ మేనేజర్ మంజులత , ఇంచార్జ్ జాన్ పాల్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓల్డ్ సిటీ మీర్‌చౌక్‌లో అర్థరాత్రి గన్ ఫైరింగ్

హైదరాబాద్: అర్ధరాత్రి గన్ ఫైరింగ్ కలకలంరేపింది. సివిల్ వివాదంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. కొన్ని రోజుల క్రితం అర్ఫాత్ అనే వ్యక్తి.. ఓ ఇంటిని కొనుగోలు చేశారు. అయితే ఆ ఇంటికి సంబంధించి గత కొన్ని రోజులుగా ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. ఆ ఇంటిపై కోర్టులో కేసు ఉండగా ఎలా కొంటారని పక్క ఇంటి వారు గొడవకు దిగారు. ఇదే విషయంపై ఇరువర్గాలవారు పోలీస్ స్టేషన్, కోర్టుకు వెళ్లారు. గత శనివారం మరోసారి మీర్ చౌక్ పోలీస్ స్టేషన్‌లో అర్ఫాత్ కేసు పెట్టారు. ఇదే విషయంలో అర్థరాత్రి అడ్వకేట్ మహ్మద్ అలీ.. మూరు?జ.. గన్‌తో వచ్చి గొడవ చేశారు. భయపెట్టడానికి అడ్వకేట్ తన లైసెన్సుడ్ గన్‌తో గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాలకు చెందినవారు రాళ్లు.. కర్రలతో ఒకరిపై ఒకరు పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించారు. గన్ ఫైరింగ్‌లో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని, ఇరువర్గాలను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అక్కడ కళాకారులు, డీజేలను ఏర్పాట్లు చేస్తున్నాం: తలసాని



హైదరాబాద్: దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా 22న అమర జ్యోతి ప్రారంభోత్సవం పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. సాయత్రం నాలుగు గంటలకి అంబేద్కర్ విగ్రహం నుంచి భారీ వాహన ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. అలాగే అన్ని నియోజక వర్గ కేంద్రాల నుంచి దాదాపు రెండు వేల మందితో ర్యాలీలు చేపట్టాలన్నారు. ఎన్నికలు దగ్గరలో ఉన్నాయి కాబట్టి ఈ ర్యాలీలతో సగం ప్రచారం జరిగినట్లు అవుతుందన్నారు. సాయంత్రం ఐదు గంటల లోపు నియోజక వర్గ కేంద్రాల నుంచి ఎమ్మెల్యేలు ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకోవాలని సూచించారు. నియోజక వర్గాల్లో లేనిపోని గ్రూపులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మన ప్రభుత్వంలో అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఖైరతాబాద్, అంబర్పెట్, ముషీరాబాద్, గోషమహల్, కూకట్ పల్లి, మల్కాజ్ గిరి నుంచి పెద్ద ఎత్తున మూడు వేల మందితో ర్యాలీలో పాల్గొనాలన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద అన్ని ఏర్పాట్లు ఉంటాయని తలసాని తెలపారు. అంబేద్కర్ విగ్రహం వద్ద కళాకారులు, డీజేల ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఆ రోజు కార్పొరేషన్ చైర్మన్‌లు షోకు టాప్ చెయ్యొద్దన్నారు.



## విధి నిర్వహణలో మంచిగా పని చేసిన కార్మికులకు ప్రశంసా పత్రాలు అందజేసిన మేయర్ బుచ్చిరెడ్డి

మేడిపల్లి,జూన్ 17 (వాయిస్ టుడే ప్రతినిధి): బోడుప్పల్ నగర పాలక సంస్థ యందు దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ప్రగతి కార్యక్రమం మేయర్ సామల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ముందుగా జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం పారిశుధ్య కార్మికులతో కలిసి ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహం వద్ద పూల మాల వేసి నివాళి అర్పించి, ప్రధాన రహదారి వెంట సఫాయి కార్మికుల గొప్పదనాన్ని తెలియజేస్తూ నినాదాలు, పాటలతో కలసి నడుస్తూ బొమ్మకు బాలయ్య ఫంక్షన్ హాల్ యందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా తెలంగాణ గుర్తు ఆకారంలో మానవ హారం ఏర్పాటు చేసి జై తెలంగాణ నినాదలు చేశారు.అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటి దాకా జరిగిన అభివృద్ధిని వివరించిన తర్వాత మున్సిపల్ కార్మికులకు పి పి ఈ కిట్లు,వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, మహిళ సంఘాల, విద్య, వైద్య, మంచి నీటి రంగాల్లో ఉత్తమ సేవలకు ప్రశంషా పత్రాలు మేయర్ బుచ్చిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి విందు ఏర్పాటు చేయగా మేయర్ వారితో కలిసి భుజించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్, కార్పొరేటర్లు, కో అప్షన్ సభ్యులు,మున్సిపల్ మేనేజర్ మంజులత,ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## బంజారా సోదరీ మణుల నృత్యాలతో సభా ప్రాంగణం పండుగ వాతావరణం తలపించింది

### బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి

మేడిపల్లి,జూన్ 17 (వాయిస్ టుడే ప్రతినిధి):- తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన గిరిజనోత్సవం కార్యక్రమం బోడుప్పల్ నగర పాలక సంస్థ యందు మేయర్ సామల బుచ్చిరెడ్డి అధ్యక్షతన దేవి ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగింది. గిరిజనుల సమక్షంలో ముందుగా బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ కు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం తో మొదలై బంజారా సోదరీ మణుల నృత్యాలతో సభా ప్రాంగణం పండుగ వాతావరణంలా కనిపించింది. ప్రభుత్వం గిరిజనులకు ఇంత ప్రాధాన్యత ఇవ్వటం చాలా సంతోషం అని ఆయన హర్షం వ్యక్తం చేశారు. బంజారాలకు కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలనీ విన్నవించగా మంత్రి మల్లారెడ్డి సహకారంతో 1 ఎకరం స్థలం కేటాయించేలా చూస్తామని మేయర్ బుచ్చిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్,గిరిజనుల తరపున కార్యక్రమం దగ్గరుండి నిర్వహించిన కార్పొరేటర్ సుమన్ భూక్య,కొత్త చందర్ గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, కొత్త శ్రీవిద్య చక్రపాణి,సీసా వెంకటేష్ గౌడ్,కో అప్షన్ సభ్యులు రంగా బ్రమ్మన్న,మున్సిపల్ మేనేజర్ మంజులత,ఇంచార్జ్ ఏ ఎస్సై జాన్ పాల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ద

## నిరుపేదలకు ముఖ్యమంత్రి కెసిఆర్ అండ

### ఎల్ ఓ సి పత్రాలను అందజేసిన గొట్టిముక్కల వెంకటేశ్వరరావు



కూకట్‌పల్లి, జూన్ 17 :(వాయిస్ టుడే): ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం 7th ఫేజ్‌లో నివాసం ఉంటున్న నీరుడి కిష్టమ్మ (70) భర్త గంగయ్య కాలుకు గాయం వల్ల నరం కట్ కావడంతో నిమ్స్ హాస్పిటల్ లో చేరారు. ఆమెకు ప్లాస్టిక్ సర్జరీ చేయాలని డాక్టర్లు సూచించడంతో వారి కుమారుడు ప్రవీణ్ కూకట్ పల్లి లోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయానికి వచ్చి గొట్టుముక్కల వెంకటేశ్వర రావు ని సంప్రదించగా వారికి ప్రభుత్వ పెద్దల సహకారంతో ఎల్ ఓ సి ద్వారా 60,000(అరవై వేల రూపాయలు) మంజూరు చేపించారు. ఆ సంబంధిత లెటర్ ని గొట్టిముక్కల వెంకటేశ్వరరావు పార్టీ కార్యాలయంలో వారి కుమారుడు ప్రవీణ్ కు అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ముఖ్యమంత్రి కెసిఆర్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు కి ధన్యవాదాలు తెలియజేయశారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
ఆదివారం 18 జూన్ 2023

# యంగ్ వన్ కంపెనీ భూమి పూజ చేసిన మంత్రి కేటీఆర్

## దేశంలో నంబర్ వన్‌గా కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు నిలుస్తుంది : కేటీఆర్

**21,000 మందికి ఉపాధి కలుగుతుంది**

**99 శాతం స్థానికులకే ఉద్యోగం కల్పిస్తామని హామీ.**

**అత్యధిక మెజారిటీతో మూడోసారి చల్ల ధర్మారెడ్డిని గెలిపించాలని కోరారు.**



పరకాల (వాయిస్‌టుడే) దేశంలో నంబర్ వన్ గా కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమ నిలుస్తుందని మంత్రి కేటీఆర్ గారు పేర్కొన్నారు.శనివారం ఉదయం పరకాల నియోజకవర్గంలోని గీసుగొండ, సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమలో నూతనంగా నిర్మించబోయే యంగ్ వన్ కంపెనీ నిర్మాణ పనులకు స్థానిక శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ చైర్మన్ బండ ప్రకాష్, శాసనసభ్యులు ఆరూరి రమేష్, పెద్ది సుదర్శన్ రెడ్డిలతో కలిసి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ గారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి కేటీఆర్ గారు మాట్లాడుతూ.ఇలాంటి ఎన్నో సంస్థల ద్వారా ఉమ్మడి జిల్లాలు ఉండే నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు దక్కుతయాన్నారు. వరంగల్ కి పూర్వ వైభవం తెచ్చేందుకే కాకతీయల పేరుతో మెగా టెక్స్ టైల్ పార్క్ ను ఏర్పాటు చేసామన్నారు. భారత దేశం లో అతి పెద్ద టెక్స్ టైల్ పార్క్ మన రాష్ట్రంలో,మన వరంగల్ జిల్లాలో,మన పరకాల నియోజకవర్గంలో ఉండటం గర్వకారణమని కొనియాడారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ కోసం భూములు ఇచ్చిన రైతులకు పేరు పేరున శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నట్లు తెలిపారు. కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమకు భూములు ఇచ్చిన ప్రతి రైతుకు ఆగస్టు 15 తేదీలోపు లే అవుట్ పూర్తి చేసి పట్టాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు.

దాదాపు యంగ్ వన్ కంపెనీ ద్వారా 21000మందికి ఉపాధి దక్కుతుందన్నారు. 99 శాతం స్థానికులకే ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.అందులో 80 శాతం మహిళలకే ప్రాధాన్యత ఉంటుందన్నారు.వారి పిల్లల కోసం కూడా డే కేర్ ఏర్పాటు ఉంటుంది.మన రాష్ట్రంలో నల్ల బంగారంతో పాటు తెల్ల బంగారం(పత్తి) అతి నాణ్యత మైనది ఉంటుందన్నారు.ఫామ్ నుండీ ఫ్యాషన్ అనే లక్ష్యం తో ఇక్కడే వస్త్రాలు తయారు కావాలన్న సంకల్పంతో టెక్స్ టైల్ పార్క్ కి సీఎం కేసీఆర్ గారు శ్రీకారం చుట్టారని తెలిపారు.అంతర్జాతీయ ప్రమాణాల తో ఇక్కడ వస్త్రాలు తయారు కానున్నాయి ఇక్కడ తయారు చేసే దుస్తులు ప్రపంచ దేశాలకు ఎగుమతి అవ్వను న్నాయన్నారు. ఇప్పటికే గణేష్ అండ్ కంపెనీలు ఉత్పత్తి, ఎగుమతులు ప్రారంభం అయినట్లు మంత్రి తెలిపారు.వచ్చే సెప్టెంబర్ నెలలో సీఎం కేసీఆర్ గారి చేతులమీదుగా Kitex కంపెనీని ప్రారంభం చేసుకోబోతున్నట్లు తెలిపారు.పరిశ్రమల స్థాపన కు తెలంగాణలో అనుకూల వాతావరణం ఉంటుంది. వ్యవసాయం, టెక్స్ టైల్ రంగంతో మన రాష్ట్రంలో జీవనోపాధి అవకాశాలు మెరుగు పడ్డాయన్నారు.కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ తో టెక్స్ టైల్ రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని, యంగ్ వన్ తో 21000,కీటెక్స్ కంపెనీ తో 12000 ,గణేష్ కంపెనీ తో 1000 మందికి ప్రత్యక్షం గా,మరో 60,000 మందికీ పరోక్షంగా ఉపాధి దొరకనుందన్నారు.మున్ముందు మరిన్ని కంపెనీ లు మన రాష్ట్రనికి రానున్నాయి.తెల్ల బంగారం పండించే రైతులకి మంచి లాభాలు వచ్చేలా టెక్స్ టైల్ రంగాన్ని బలోపేతం చేస్తాం.టెక్స్ టైల్ పార్క్ పై అవగాహన లేకుండా మాట్లాడుతున్న వారి మాటలు తిప్పికొట్టాలి.టెక్స్ టైల్ పార్కు ఏర్పాటుకు భూసేకరణ కోసం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారి కృషి ఎంతో ఉందన్నారు.నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకున్ని ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారు.పరకాల నియోజకవర్గంలో చల్లా ధర్మారెడ్డి గారిని ఎదుర్కొనే ప్రతిపక్ష నాయకుడు లేరని వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో మూడోసారి చల్లా ధర్మారెడ్డి గారిని గెలిపించుకొని మీ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారు మాట్లాడుతూ... ఇలాంటి గొప్ప గొప్ప కంపెనీలు ఇక్కడికి రావడంలో మంత్రి కేటీఆర్ గారి కృషి ఎంతో ఉంది.టెక్స్ టైల్ పార్క్ భూముల సేకరణ కోసం పడిన కష్టం...కంపెనీల ఏర్పాటుతో ఇప్పుడు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. ప్రతిపక్షాలు చేసిన కుట్రలను ఈ కంపెనీల ద్వారా బుద్ధి చెప్పామన్నారు. ఈ కంపెనీల ద్వారా వేలాది సంఖ్యలో యువతకు ఉపాధి కల్పిస్తుంది అన్నారు. ముఖ్యంగా స్థానికంగా భూములు ఇచ్చిన ప్రతి కుటుంబంలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. భూములు కోల్పోయిన వారికి ఆగస్టు నెల లోగా పట్టాలు అందజేస్తామన్నారు. టెక్స్ టైల్ రంగంతో మన నియోజకవర్గంలో జీవనోపాధి అవకాశాలు మెరుగు పడ్డాయి అన్నారు. ఇంకా మరెన్నో గొప్ప కంపెనీలు మన టెక్స్ టైల్స్ పార్కులో రానున్నాయి. ఇంత పెద్ద గొప్ప యంగ్ వన్ కంపెనీ టెక్స్టైల్ పార్కులో ఏర్పాటు చేస్తున్నటువంటి కంపెనీ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అన్ని విధాలుగా పరకాల నియోజకవర్గం అభివృద్ధి దిశలో తీసుకెళ్లేందుకు సహకరిస్తున్నటువంటి మంత్రి కేటీఆర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.నియోజకవర్గంలో నూతన ఏర్పడ్డ నడికూడా,దామెర మండలాల పోలీస్ స్టేషన్ లకు,డిగ్రీ కళాశాలకు,గురుకుల పాఠశాలలకు పక్క భవనాలు,పరకాల మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మంత్రి గారిని కోరారు.



## కేటీఆర్ పర్యటన వేళ.. వరంగల్ లో ఫ్లెక్సీల వార్

వరంగల్: జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో నగరంలో ఏర్పాటు చేసిన మేయర్ గుండు సుధారాణి, వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన వద్దిరాజు రవిచంద్ర ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం తొలగించారు. కాగా.. ఈ ఫ్లెక్సీల తొలగింపు బీఆర్ఎస్లోనే కొందరు వ్యక్తులు చేశారని స్థానికంగా చర్చ నడుస్తోంది.



## కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన : కేటీఆర్

వరంగల్ జిల్లా కేంద్రంలో కొత్తవాడలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని శనివారం మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ప్రారంభించారు. ఆయన వెంట నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## దుప్పి మాంసం విక్రయిస్తున్న నిందితులను పట్టుకున్న అటవీశాఖ అధికారులు

**ముగ్గురి పట్టివేత, ఒకరి పరార్**

**మీడియా ముందు వివరాలు వెల్లడించిన రేంజి అధికారి నరేందర్**

ఏటూరునాగారం: ఏటూరునాగారం మండలం కేంద్రంలో,అంబేద్కర్ కాలనీలో శనివారం దుప్పి మాంసం విక్రయిస్తున్న ముగ్గురిని,పక్కా సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు వారిని వల పన్నీ పట్టుకున్నారు. ఒకరు పరారీలో ఉన్నారు. అటవీశాఖ ఇంచార్జి రేంజ్ అధికారి నరేందర్ వారిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన తుమ్మ మహేష్,మార జగన్,దుర్గం రాము వీరి ముగ్గురిని పక్క సమాచారం మేరకు పట్టుకుని వీరి వద్ద కవర్లలో కట్టిపెట్టిన మాంసం, తల, కాళ్ళు, దాదాపు 20 కిలోల మాంసం స్వాధీనం చేసుకున్నారు. ఒకరు ఆకుల శంకర్ పరారీలో ఉన్నాడు.అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.నరేందర్ మాట్లాడుతూ వన్య ప్రాణులను వేటాడినా ,విక్రయాలు జరిపినా,ఉచ్చులు పెట్టినా,ఉపేక్షించేది లేదని వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరి వద్ద ఇంకా ఎవరు ఎవరు కొన్నారు,ఎక్కడ ఎక్కడ విక్రయించినారు అని వివరాలు సేకరిస్తున్నారు.

## హనుమకొండ వరంగల్ తూర్పు ఎంఎల్ఏ ఒంటెద్దు పోకడలను ఖండిస్తున్నాం

**-టీయూడబ్ల్యూజే (ఐజేయూ)**

వరంగల్ (వాయిస్ టుడే): జర్నలిస్టుల మధ్య చిచ్చుపెట్టేలా వరంగల్ తూర్పు ఎమ్యెల్యే నన్నపనేని నరేందర్ ఒక ఛోటా మోటా సంఘాన్ని బుజాలపైకి ఎక్కించు కోవడాన్ని తప్పుపడుతున్నాం. 6 దశాబ్దాల చరిత్ర కలిగిన తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజేయూ) సంఘాన్ని విస్మరించి ఏకపక్షంగా ఒక సంఘాన్ని నెత్తికెక్కించుకోవటం సరియైనది కాదు. జర్నలిస్టులకు ప్రభుత్వం నుండి హక్కుగా వచ్చే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరు విషయంలో చేస్తున్న రాజకీయం తగదు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో ఘోరంగా ఓటమి చెందిన వారిని పక్కనపెట్టుకుని చేస్తున్న రాజకీయానికి తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుంది. పద్ధతి మార్చుకోకపోతే ఎంఎల్ఏ నరేందర్ కు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నాం. ప్రభుత్వ పథకాన్ని తన సొంత పథకమన్నట్లుగా ప్రచారం చేసుకుంటూ, ఒకే సంఘాన్ని నెత్తినపెట్టుకుని, దేశ వ్యాప్తంగా ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘాన్ని విస్మరించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

## వైర్లెస్ మైక్ సెట్ అందజేత

కోదాడ/నడిగూడెం:: జూన్17( వాయిస్ టుడే) నడిగూడెం. మండలం రామాపురం రెవెన్యూ పరిధిలో ఉన్న లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయానికి ,మూకర చిన్న వీరయ్య వైర్లెస్ మైక్ సెట్ శనివారం అందించటం జరిగింది, దాతను ఆలయ కమిటీ సభ్యులు,పూజారి అభినందించారు.

## జర్నలిస్టు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రారంభించిన కేటీఆర్



తెలంగాణ ప్రభుత్వం వరంగల్ తూర్పు జర్నలిస్టుల కోసం దేశాయిపేటలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను శనివారం మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీ వద్దిరాజుకు ఆహ్వానం

**గోల్కొండ బోనాలకు హాజరు కావలసిందిగా ఎంపీ రవిచంద్రను ఆహ్వానించిన ఆలయ కమిటీ**

ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా జరిపే గోల్కొండ జగదాంబ మహంకాళీ బోనాలకు అతిథిగా హాజరు కావలసిందిగా కోరుతూ ఆలయ కమిటీ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను ఆహ్వానించింది.ఈనెల 22వ తేదీ నుంచి గోల్కొండ బోనాలు అంగరంగ వైభవంగా ప్రారంభమవుతాయి.ఈ బోనాల ఉత్సవాలలో భాగంగా ఆ రోజు మధ్యాహ్నం లంగర్ హౌజ్ చౌరస్తా నుంచి మొదలయ్యే తొట్టెల,రథం ఊరేగింపు గోల్కొండ కోటలోని మహంకాళీ అమ్మ వారి ఆలయం వరకు కొనసాగుతుంది.వేలాది మంది భక్తుల సమక్షంలో జరిగే ఈ ఉత్సవానికి అతిథిగా హాజరు కావలసిందిగా కోరుతూ ఆలయ కమిటీ ఛైర్మన్ ఆరెళ్ల జగదీష్ యాదవ్ తరపున చంద్రకాంత్, సాయికిరణ్ తదితరులు ఎంపీ రవిచంద్రను శనివారం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.అదేవిధంగా మున్నూరుకాపు ప్రముఖులు సర్దార్ పుటం పురుషోత్తం,ఆర్వీ మహేందర్ లను కూడా గోల్కొండ బోనాలకు హాజరు కావలసిందిగా ఆహ్వానించారు.

## పివైఎల్ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి



కోదాడ:: జూన్ 17(వాయిస్ టుడే): పాలక వర్గ విధానాలను వ్యతిరేకిస్తూ, నూతన సమాజ, దోపిడీ రహిత ప్రజా రాజ్య నిర్మాణం కోసం జరిగే పోరులో నడవాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర నాయకులు దరవత్ రవి పిలుపునిచ్చారు. స్థానిక లాల్ బంగ్లాలో పి వై ఎల్ జిల్లా మహాసభ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఈ నెల 24న సూర్యాపేట పట్టణంలో జరుగు జిల్లా ఎనిమిదవ మహాసభలను జయప్రదం చేయాలని యువకులకు పిలుపునిచ్చారు. దేశ జనాభాలో యువత మూడో భాగంగా ఉన్నప్పటికీ ప్రజల ఆకాంక్షల గురించి ఆలోచించకుండా, ప్రజలకు, సమాజానికి అండగా నిలవాల్సిన యువత, పాలక వర్గాలు ప్రవేశ పెట్టిన మద్యంకు అలవాటు పడి, జోగుతూ, ఊగుతూ, గుట్కాలు, చెడు అలవాట్లకు బానిసలవుతూ, భవిషత్ ను జారవిడుచుకుంటున్నారని అని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, ఇంటికో ఉద్యోగం లాంటి మాటలను నీటిమీద రాతలుగా చేసి, బడా కార్పోరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న, ప్రజా సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ,అమ్మి వేస్తున్న, దేశ వినాశనానికి దారితీస్తున్న, ప్రమాదకర పరిస్థితులను వ్యతిరేకిస్తూ,ఉద్యమించే గురుతరమైన బాధ్యత, కర్తవ్యం యువతీ, యువకులపై ఉంటుందని వారు అన్నారు.

తెలంగాణ రాష్ట్ర స్వప్నికుడు, సమాజ మేలు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మానవతావాది, ప్రజా ఉద్యమాల ప్రేమికుడు ప్రో హరగోపాల్, సంధ్యక్క, విమలక్క, తదితరులపై చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం ఉపాను ప్రయోగించడం అప్రజాస్వామికం, అన్యాయమని వెంటనే వారిపై నమోదు చేసిన అక్రమ కేసులను బేషరత్ గా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ డివిజన్ అధ్యక్షులు కామల అనంత రామయ్య, నాయకులు సురేష్, షరీఫ్, సైదులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా కార్యాలయాన్ని ప్రారంభించిన కేటీఆర్



వరంగల్ నగరంలోని ఏఎస్ఎం కళాశాల వద్దనున్న వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సోషల్ మీడియా, మీడియా కార్యాలయాన్ని మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రభుత్వ విప్ వినయ్ భాస్కర్ ప్రారభించారు. ఎమ్మెల్యే నన్నపునేని, ఆరూరి రమేష్ ఇతర ప్రజాప్రతినిధులు, బిఆర్ ఎస్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కులవృత్తులకు ప్రకటించిన లక్ష రూపాయల రుణ అప్లికేషన్ కాలపరిమితిని మరొక ఇరవై రోజులు పొడగించాలి

## తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్



కరీంనగర్, జూన్ 17 (వాయిస్ టుడే): తెలంగాణ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలలో భాగంగా కురవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించాలని ఒక మంచి ఉద్దేశంతో ప్రకటించిన ఈ పథకం యొక్క దరఖాస్తు కాలపరిమితిని మరొక ఇరవై రోజులు పొడగించాలని ఈరోజు కరీంనగర్ లో జరిగిన తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక సమావేశంలో ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల తొమ్మిది నుండి నేటి వరకు ఒక ఒక ఐదు శాతం మంది మాత్రమే ఈ పథకం కోసం దరఖాస్తులు చేసుకోగలిగినారని, కుల ధ్రువీకరణ పత్రం మరియు ఆదాయ ధ్రువీకరణ పత్రాలలో జారీలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సర్వర్లు పనిచేయక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నా విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని, ఇది కేవలం ఒక్క జిల్లా సమస్య కాదని ప్రతి జిల్లాలో ఇదే రకమైన ఇబ్బందులు తెలంగాణ అంతటా కూడ ఉన్నాయని వారు అన్నారు. ఉదయం నుండి రాత్రి వరకు కులవృత్తిదారులు తహసిల్దార్ కార్యాలయాలకు బారులు తీరుతున్నారని, మండల తహసీల్దారు కార్యాలయాలలో దరఖాస్తులు గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన విషయాన్ని గుర్తించి ప్రభుత్వం సమయాన్ని పొడగించి అందరూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని వారు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండల తాహసిల్దార్ కార్యాలయంలో ఇదే రకమైన సమస్య ఉందని, చాలా మందికి ఇంకా కుల ఆదాయ సర్టిఫికెట్ చేతికి రాకపోవడంలో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం దరఖాస్తుకు ఆఖరి తేదీ ఈనెల ఇరవైగా నిర్ణయం చేయడంలో అది పూర్తిగా దగ్గర పడుతుండడంతో ఈ రెండు మూడు రోజులలో అటు సర్టిఫికెట్ లు రాక ఇటు అప్లోడ్ కాక దరఖాస్తులు చేసుకోలేక నిజమైన అర్హులు చాలామంది నిరుపేద కులవృత్తి దారులు ఈ లక్ష రూపాయల పథకానికి దరఖాస్తులు చేసుకునే అవకాశం లేకుండా పోతుందని గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. ప్రభుత్వం కులవృత్తిదారులను అందుకోవడం కోసం ఒక మంచి ఉద్దేశంతో ప్రవేశ పెట్టిన ఈ పథకం నిజంగా అర్హత కలిగిన వారందరికీ చేరాలంటే రాష్ట్ర ప్రభుత్వం ఈయొక్క దరఖాస్తు తేదీని పొడగించాలని తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినారు. ఈ సమావేశంలో తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జంపాల నర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవుదుర్తి విజయ్ కుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గర్వకుర్తి శంకర్, జిల్లా నాయకులు జనగామ సత్యనారాయణ, శ్రీరాముల రమేష్, గర్వకుర్తి విద్యాసాగర్ కొత్వాల ఆంజనేయులు ఉన్నారు.



## ఘనంగా ఉత్తమ్ పద్మావతి జన్మదిన వేడుకలు

మునగాల 17 జూన్ 2023(వాయిస్ టుడే): మునగాల మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కే జైపాల్ రెడ్డి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పోలిశెట్టి బుచ్చి పాపయ్య, గారు, విలాస కవి రామరాజు, కాలే సామ్యూల్, ఎల్ ఈదారావు, రషీద్, పోలంపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, వీరబాబు, హరిబాబు, కాసర్ల వెంకట్ శ్రీనివాస్ గౌడ్ , పసుపులేటి గోపి, చిన్న, పి కిరణ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి జన్మదిన వేడుకలు

కోదాడ, జూన్ 17(వాయిస్ టుడే): కోదాడ క్యాంప్ కార్యాలయంలో శనివారం టిపిసిసి ఉపాధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పుట్టిన రోజు వేడుకలను కోదాడ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై పద్మావతి రెడ్డి కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.



## నిబంధనలకు విరుద్ధంగా స్కూల్లాల్లో పాఠ్యపుస్తకాలు అమ్ముతూ విద్యార్థులని ఇబ్బంది పెడుతున్నారు

### –ఏబీవీపీ రాష్ట్ర కార్యాసమితి సభ్యుడు రాపాక సాయికుమార్

జగిత్యాల జిల్లా ప్రతినిధి (జూన్ 11,23)వాయిస్ టుడే :ఏబీవీపీ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో పుస్తకాలు అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలలైన కేజీఆర్, శ్రీచైతన్య హై స్కూల్ నందు ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ సందర్బంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యాసమితి సభ్యుడు రాపాక సాయికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ విద్యార్థుల వద్ద నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ ఇబ్బందులకి గురి చేస్తున్నారు. అదే కాకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్కూల్లాల్లో పాఠ్యపుస్తకాలు అమ్ముతూ విద్యార్థులని ఇబ్బంది పెడుతున్నారు. ఇలాంటి పాఠశాలల పైన చర్యలు తీసుకోవాలని స్థానిక డిఈ ఓ కి ఎన్ని సార్లు చెప్పిన నిమ్మకు నీరేతినట్లు వ్యవహారిస్తున్నారని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు కొమ్ము కాస్తున్నారని అన్నారు.ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి అలాంటి పాఠశాలల పైన చర్యలు తీస్కొని,యాజమాన్యం పైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేసారు. లేని యెడల రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేసి డిఈ ఓ ని అధికారం నుండి తొలగించేలా చేస్తామని హెచ్చరించారు. అనంతరం యమ్ ఈఓ వచ్చి కేజీఆర్,శ్రీచైతన్య పాఠశాలల్లోని పాఠ్య పుస్తకాలని సీజ్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి మనువాడ నందు, జిల్లా హాస్టల్స్ కన్వినర్ నీరేటి శ్రీనివాస్, జోనల్ ఇంచార్జి రాజు, మనోహర్, విష్ణు, రాకేష్, దుర్గ ప్రసాద్, అంజి, రఘు, కృష్ణ, దీపక్, ఘబీర్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు సంక్షేమంలో పెద్దపీట

### - జడ్పీటిసి పిట్టల రవీందర్



కరీంనగర్, జూన్ 17( వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గిరిజనులకు పెద్దపీట వేసిందని ముఖ్యంగా గిరిజన కుటుంబాలు ఆడపిల్ల పుడితే కష్టంగా భావించి ఆడపిల్లను అమ్మి జీవనం కొనసాగించిన గిరిజన ప్రజలు నేడు తెలంగాణ ప్రభుత్వంలో ఆడపిల్ల అంటేనే ఒక లక్ష్మీ దేవతలాగా పూజిస్తున్నారని అందుకు కారణం కేసీఆర్ అని. ఈరోజు కళ్యాణ లక్ష్మి పథకాన్ని తీసుకువచ్చి ఆడపిల్ల ముఖాల్లో చిరునవ్వు అందించిన ప్రభుత్వం బి ఆర్ఎస్ ప్రభుత్వం అని జడ్పీటిసి పిట్టల రవీందర్ అనీ కొనియాడారు . భూక్యా తిరుపతి నాయక్ మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీగా తీర్చిదిద్ది గిరిజల్లే పరిపాలించే విధంగా 3000 పైచిలుకు తండాలను గ్రామపంచాయతీలో గుర్తించిన ప్రభుత్వం కెసిఆర్ ప్రభుత్వం అని ఆరు శాతం రిజర్వేషన్ ఉన్న గిరిజనులకు 10% రిజర్వేషన్ అమలు చేసిన ఘనత కేసీఆర్ గిరిజన విద్యార్థులకు విదేశాల్లో విద్య అందించడం కోసం ఉచితంగా 20 లక్షల రూపాయలు సహాయం అందిస్తున్నారని అన్నారు. పోడు భూముల పంపిణీ తండాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల కంటే దీటుగా గిరిజన ప్రజలను ఆదుకున్న ప్రభుత్వం కెసిఆర్ ప్రభుత్వమని అదేవిధంగా వారు ఆరాధ్య దైవంగా భావించే శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు ప్రభుత్వపరంగా నిర్వహించడం ప్రతి జిల్లాలో గిరిజన భవన్ నిర్మాణం కోసం నిధులు కేటాయించి భవనాలు నిర్మించడం గురుకుల హాస్టల్ ఏర్పాటు చేయడం గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి కార్పొరేషన్ లోన్ కేటాయించడం గిరిజన పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి సబ్సిడీ లోన్ అందించడం ఇలా ఏ ప్రభుత్వం కూడా గతంలో పనులన్నీ కూడా కేసీఆర్ గారి ప్రభుత్వంలో చేయడం జరిగిందని అన్నారు .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోగిలి మంజుల, ఎంపీటీసీ లు తిరుపతి నాయక్, పట్టేమ్ శారదా లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, డిటిడిఓ అధికారి దివాకర్ రావు, వార్డు సభ్యులు సుజాత శ్రీకాంత్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మోహన్ నాయక దస్ మీ బాయ్, భాస్కర్ నాయక్, విట్టల్ నాయక్, రామచంద్రనాయక్, శ్రీనివాస్ నాయక్, అంబి బాయ్, కమలాబాయి, సదానందం నాయక్, నజీమా బేగం పాల్గొన్నారు.





## ఎస్ టి (బి)హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

### ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హాస్టల్ ముందు ధర్నా

కోదాడ :: జూన్ 17(వాయిస్ టుడే ) కోదాడ పట్టణంలోని ఎస్ టి( బి ) హాస్టల్ వార్డెన్ రవిని సస్పెండ్ చేయాలని ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో వసతి గృహం ముందు శనివారం ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ మాట్లాడుతూ ఎస్ టి బి వసతి గృహ వార్డెన్ రవి నెల రోజులకు ఒకసారి కూడా హాస్టల్ కు రావడం లేదన్నారు. స్థానికంగా విద్యార్థులకు అందుబాటులో ఉండకుండా విధుల పట్ల అలసత్వం వహిస్తున్నారన్నారు. మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని, మెనూ పాటించాలని అడిగిన విద్యార్థులపై అసభ్య పదాజాలంతో దూషిస్తున్నారన్నారు.వసతి గృహ గదులు టాయిలెట్స్ ను శుభ్ర పరచడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వార్డెన్ రెగ్యులర్గా హాస్టల్ కి రాకపోవడంతో వర్కర్లే వార్డెన్ గా ప్రవర్తిస్తున్నారని, స్టోర్ రూమ్, మెనూ పూర్తిగా వర్కర్ల ఇష్టానుసారంగా నడుస్తుంది అన్నారు. వార్డెన్ ను ప్రశ్నించిన విద్యార్థులను బలవంతంగా హాస్టల్ నుండి పంపిస్తున్నారని వారు అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్ ను సందర్శించి విధులను సక్రమంగా నిర్వర్తించని వార్డెన్ ను సస్పెండ్ చేయాలని, హాస్టల్లో మెనూ సక్రమంగా అమలు అయ్యేలా విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వారి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బానోత్ వినోద్ కుమార్, నాయకులు జాను గణేష్, చందర స్వామి సాయి రవీందర్ నవీన్ వెంకటేష్ సమీర్ రవి శ్రీను గణేష్ వంశీ చరణ్ అజయ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలు

కోదాడ/నడిగూడెం, జూన్17(వాయిస్టుడే): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నడిగూడెం మండల స్థాయిలో వివిధ పాఠశాలకు సంబంధించిన విద్యార్థులకు వ్యాసరచన ,చిత్రలేఖనం పోటీలను తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీమతి ధన విజయలక్ష్మి జడ్పీహెచ్ఎస్ నడిగూడెం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీ మైనం శోభన్ బాబు , సిఆర్పిలు బంధారపు గోవర్ధన్ ,రాజుల గురుస్వామి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు షేక్ సిరాజుద్దీన్ పాల్గొన్నారు.



## ఆంగ్లంపై పట్టు సాధించాలి

### సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్

సైదాపూర్:(వాయిస్ టుడే ) గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులు ఆంగ్లం సబ్జెక్టు పై పట్టు సాధించాలని సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ అన్నారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని ఆకునూర్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఆంగ్లంలో 10 జీపీఏ సాధించిన ఇద్దరు విద్యార్థులు కుతాటి పూజ శ్రీ కడారి తనయ్ లకు ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ అనురాధ చేతుల మీదుగా ఆంగ్ల డిక్షనరీలను ఉచితంగా పంపిణీ చేశారు అనంతరం హన్మండ్ల భాస్కర్ మాట్లాడుతూ తాను బోధించిన ఇంగ్లీష్ సబ్జెక్టులో ఇద్దరు విద్యార్థులకు 10 జీపీఏ రావడం సంతోషకరమన్నారు ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఇంగ్లీష్ మీడియం విద్యా బోధన నిర్వహిస్తున్నారని నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ప్రభుత్వ ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహిస్తున్నారని అన్నారు క్రమశిక్షణతో ఇష్టపడి విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని విద్యార్థులకు సూచించారు ప్రతి సంవత్సరం 10వ తరగతిలో ఆంగ్లంలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఇంగ్లీష్ డిక్షనరీలను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత పదవ తరగతి విద్యార్థులు ఆంగ్లంతో పాటు అన్ని సబ్జెక్టులలో 10 జీపీఏ సాధించాలని కోరారు.

# ప్రభుత్వ విద్యాపై లేని శ్రద్ధ కార్పొరేట్ విద్యా పై ఎందుకు



మక్తల్ జూన్ 17 (వాయిస్ టుడే): తెలంగాణ దశాబ్ద ఉత్సవాలు బాగానే మక్తల్ లో పట్టణ ప్రగతి కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి కార్పొరేట్ విద్యా సంస్థలకు మద్దతుగా మాట్లాడాలని విద్యార్థి ప్రదర్శన ఆధ్వర్యంలో ప్రెస్‌మీట్ పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి భాస్కర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్ పిడీఎస్ యు జిల్లా కార్యదర్శి అజయ్లు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిగా కార్పొరేట్ విద్యావ్యవస్థకు అనుకూలంగా మాట్లాడడం సిగ్గుచేటైన విషయం. ఏనాడైనా ప్రభుత్వ బడులను సందర్శించారా మౌలిక సదుపాయాలు లేకుండా చాలీచాలని చదువులతో కాలం వెళ్ళదిస్తున్న పేద ప్రజల బడులపై లేని శ్రద్ధ, కార్పొరేట్ బడులపై ఎందుకు పేద ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే కార్పొరేట్లకు అనుకూలంగా మాట్లాడడం చూస్తుంటే ఆశ్చర్యం కలిగిస్తుంది. మొత్తం నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు లేని పాఠశాలల గురించి ఏనాడైనా ఆలోచించారా ఎందుకు ప్రభుత్వ బడులకు ప్రజలు తమ పిల్లలని పంపడానికి సిద్ధంగా లేరో ఏనాడైనా చింతించారా అసలు పేద ప్రజలపై లేని శ్రద్ధ కార్పొరేట్లపై ఉండడం వెనక చూస్తుంటే మీరు ఎవరికి ప్రయోజనం చేకూరుస్తున్నారో అర్థం అవుతుంది. ప్రభుత్వ బడులంటేనే ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీల బడులుగా మారిపోయాయి. ఉన్నత కుటుంబాల నుంచి ఒక్కరైనా మీ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్నారా అలా చేర్పించినట్టు ఎక్కడైనా దాఖలాలు ఉన్నాయా చెప్పండి. మక్తల్ చుట్టుపక్కల గ్రామాల గురించి అలా పక్కనుంచితే మక్తల్ పట్టణంలో కేంద్రంలో ఉన్న ఒక్క పాఠశాలల్లోనైనా సరైన వసతులు ఉన్నాయో లేదో ఆలోచించని మీరు విద్యార్థి, ప్రజా సంఘాలు పై ఆరోపణలు చేయడం సరైంది కాదు. రాష్ట్రంలో కెసిఆర్ సైతం ఏనాడు కూడా కార్పొరేట్ విద్యకు అనుకూలంగా మాట్లాడిన చరిత్ర లేదు. అలాంటిది మీరు బహిరంగంగా ప్రభుత్వ బడులను హాస్టలను గాలికి వదిలేసి, కార్పొరేట్ విద్యా సంస్థలు మక్తల్ కు వస్తే విద్యావ్యవస్థ బాగుపడుతుంది అనడం మీ అవగాహన రాహిత్యానికి నిదర్శనం. కార్పొరేట్ వస్తే పేద ప్రజలకు ఎట్లా నాణ్యమైన విద్య అందుతుందో చెప్పాలని ప్రజల తరఫున డిమాండ్ చేస్తున్నాము. వేలల్లో ఫీజులు వసూలు చేసి ఫీజుల పేరుతో అవమానాల పేరుతో గత పది సంవత్సరాల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 2600 మంది పిల్లలు చనిపోయారని అధికారిక లెక్కలే చెబుతుంటే మీకు అది కనపడడం లేదా. కార్పొరేట్ విద్యా వ్యవస్థలో పిల్లలు చనిపోవడం లేదని మీరు నిరూపిస్తే అంబేద్కర్ చౌరస్తాలో చర్చకు సిద్ధమని విద్యార్థి ప్రజా సంఘాలుగా ప్రకటిస్తున్నాము. విద్యా నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాల అనుమతులు పొందారు ఇది నిజం కాదా కేవలం మీ బలవంతంగానే అనుమతులు వచ్చినట్లు మక్తల్ పట్టణ ప్రజలందరికీ తెలుసు. ప్రజా ప్రతినిధిగా కార్పొరేట్ విద్యా వ్యవస్థలను ప్రోత్సహించడం,వాటికి అనుకూలంగా ప్రచారం కల్పించడం చట్ట వ్యతిరేకమైన చర్య అవుతుంది. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, జిల్లా సహాయ కార్యదర్శి బాలు,అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు శ్రీను, పి డి ఎస్ యు జిల్లా నాయకులు శేఖర్,అజయ్ లు పాల్గొన్నారు.

# నాడు త్రాగునీటి కోసం గోసపడ్డ తెలంగాణ

## నీరే జీవధారం నీరే లేకుంటే జీవనమే ప్రశ్నార్థకం
## మిషన్ భగీరథ తెలంగాణ మంచి నీళ్ల పండుగ



రాజన్న సిరిసిల్ల,జూన్ 17 (వాయిస్ టుడే) : తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు త్రాగునీటి కోసం మహిళలు బిందెలతో సుదూర ప్రాంతాలకు వెళ్ళి నీటి సేకరణ కోసం ఇబ్బందులు పడటం సర్వసాదారణంగా వుండేది. ఇందువల్ల వారు త్రాగునీరు అనే ప్రాదమిక అవసరం కోసం వారి సమయాన్ని, శ్రమని వృధా చేసుకునే వారు.మిషన్ భగీరథ కంటే ముందు భూగర్భ జలాలతో బోర్లు,మోటార్లతో నీటి సరఫరా జరిగేది. ఇవి నిలకడగా ఉండక నిరంతరం నీటి కొరతకు దారి తీస్తూ ఉండేది. అంతేకాక, భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ కారణంగా ప్రజలు ఫ్లోరోసిస్ బారిన పడేవారు.ప్రతి వేసవికి భూగర్భ జలాల మట్టము పడిపోవడం వల్ల త్రాగు నీటి కొరత తారా స్తాయికి చేరి సీఆర్ఎఫ్ / నోన్ సీఆర్ఎఫ్ నిధుల ద్వారా వ్యవసాయ బోర్లను లీజుకు తీసుకొని ట్యాంకర్ల ద్వారా మంచి నీటి సరఫరా చేయవలసి వచ్చేది. క్రొత్తగా బోర్లు వేసినా, నీటి లభ్యత లేనందువల్ల బోర్లు విఫలమయ్యేవి. అందువలన, ప్రజలకు మంచి నీటి ఇబ్బందులు తప్పెవి కాధు.ఈ పరిస్తితుల ధృష్ట్యా, తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటికి రక్షిత మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో 43,791 కోట్ల బడ్జెట్ తో తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరధను ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి చంద్రశేకర్ రావు సిద్దిపేట శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు 1998 సంవత్సరంలో " సిద్దిపేట సమగ్ర త్రాగునీటి పథకం ప్రతి గృహానికి నీరు అందించాలని రూపొందించారు. దీన్ని ఆదారంగా, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించిన తరువాత మిషన్ భగీరత పథకాన్ని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేకర్ రావు ప్రవేశపెట్టారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా గ్రామాల్లోని ప్రతీ ఒక్కరికి రోజుకు 100 లీటర్లు, మున్సిపాలిటీల్లోని ప్రతీ ఒక్కరికి రోజుకు 135 లీటర్లు, మున్సిపల్ కార్పోరేషన్ల పరిధిలోని ప్రతీ ఒక్కరికి రోజుకు 150 లీటర్ల తాగునీరు అందించాలని నిర్ణయించడం నీటి సరఫరాకై, కృష్ణా, గోదావరి నదులు, వాటికి అనుసంధానించిన ప్రధాన రిజర్వాయర్లు తదితర ఉపరితల జల వనరుల నుండి నీటిని కేటాయించడం జరిగింది.అనుకున్నదే తడవుగా 2015వ సంవత్సరంలో ఈ పథకాన్ని మొదలుపెట్టి అకుంఠిత దీక్ష, క్రమశిక్షణ మరియూ నిబద్దతతో అనతి కాలంలోనే పూర్తి చేయడం జరిగింది. ఈ పథకంలో భాగంగా ప్రధాన రిజర్వాయర్లలో (19) ఇన్టేక్ వెల్స్, (50) మంచినీటిని శుద్దిచేసే కేంద్రాలు, (2983) నీటిని తోడే ప్రధాన పంపులు, 56 వేల కిలో మీటర్ల ప్రధాన పైపులైన్లు మరియూ ఇతర ప్రధాన ట్యాంకులు నిర్మించి రాష్ట్రంలో ప్రతీ గ్రామానికి మరియూ పల్లెపల్లెకు స్వచ్చమైన త్రాగునీరు సరఫరా చేయబడుతుంది.

తెలంగాణ రాష్ట్రావతరణానికి పూర్వం, సిరిసిల్ల వేములవాడ మరియు చొప్పదండి నియోజకవర్గ వాసులు నిత్యం మంచి నీటి అవసరాల కొరకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. మిషన్ భగీరథ ఏర్పాటుతో, నియోజక వర్గ మంచి నీటి సరఫరా ముఖ చిత్రం పూర్తిగా మారిపోయింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఉపరితల నీటి వనరులైనటువంటి, మిడ్ మానైర్ రిజర్వాయర్ నుండి సేకరించిన నీటి ద్వారా సిరిసిల్ల వేములవాడ మరియు చొప్పదండి నియోజకవర్గం లోని అన్ని గ్రామాలకు, మునిసిపాలిటీలకు స్వచ్చమైన త్రాగునీటిని సరఫరా చేస్తుంది.మిషన్ భగీరథ పథకం సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి సెగ్మెంటు కి గోదావరి నదితో అనుసంధానమైన మిడ్ మానైర్ రిజర్వాయర్ ద్వారా వేములవాడ మండలంలోని రుద్రవరం గ్రామ పరిధిలో ఇన్టేక్ వెల్ ద్వారా పంపులతో తోడి, అగ్రహారం లో ఉన్నటువంటి 120 ఎం ఎల్ డి నీటి శుద్ది కేంద్రం లో శుద్ది చేసి, 1567 కి.మీ పైపుల ద్వారా, 2 మాస్టర్ బాలెన్సింగ్ రెసెర్వాయిర్ల ద్వారా, 2 ఓవర్ హెడ్ బాలెన్సింగ్ రెసెర్వాయిర్ల ద్వారా, 10 బ్రేక్ ప్రెషర్ ట్యాంకుల ద్వారా, 24 సంప్ ల ద్వారా, 427 గ్రామలలోని 879 ట్యాంకులకి, 3 యు ఎల్ బి లకు ప్రతి రోజూ సరఫరా చేయబడుతుంది.

అంతే కాకుండా సిరిసిల్ల వేములవాడ చొప్పదండి సెగ్మెంటు లో భాగంగా గోదావరి నదితో అనుసంధానమైన అప్పర్ మానైర్ రిజర్వాయర్ ద్వారా నీటిని పంపులతో తోడి, కొల్లమద్దిలో ఉన్నటువంటి 7 ఎం ఎల్ డి నీటి శుద్ది కేంద్రం ద్వారా శుద్ది చేసి, 60 కి. మీ పైపుల ద్వారా, 1 ఓవర్ హెడ్ బాలెన్సింగ్ రెసెర్వాయిర్ల ద్వారా, 3 సంప్ లు ద్వారా సిరిసిల్ల జిల్లాలోని, గంభీరావుపేట మండలంలోని 9 గ్రామాలు మరియు ముస్తాబాద్ మండలంలోని 8 గ్రామాలు మొత్తం 17 గ్రామలలోని 38 ట్యాంకులకి ప్రతి రోజూ నీటి సరఫరా చేయబడుతుంది.గ్రిడ్ పరంగా సిరిసిల్ల నియోజికవర్గమునకు 425 కోట్లు, వేములవాడ నియోజికవర్గమునకు 375 కోట్లు మరియు చొప్పదండి నియోజికవర్గమునకు 332 కోట్లు వెచ్చించడం జరిగినది. మొత్తం వ్యయం 1132 కోట్లతో గ్రిడ్ పనులు పూర్తి చేసి, 2018 నుంచి నీటి సరఫరా చేయడం జరుగుతుంది.ఇంట్రా పరంగా నియోజకవర్గాల వారిగ చూసుకుంటే, సిరిసిల్ల నియోజికవర్గమునకు 73 కోట్లతో 141 గ్రామలలోని 286 ట్యాంకులకి, 609 కీ.మీ అంతర్గత పైపులైన్లు ద్వారా, 54,178 నల్లా కనెక్షన్లకు, వేములవాడ నియోజికవర్గమునకు 41 కోట్లతో 104 గ్రామలలోని 169 ట్యాంకులకి, 396 కీ.మీ అంతర్గత పైపులైన్లు ద్వారా, 40993 నల్లా కనెక్షన్లకు , చొప్పదండి నియోజికవర్గమునకు 13 కోట్లతో నియోజకవర్గంలోని 30 గ్రామలలోని 54 ట్యాంకులకి, 133 కీ. మీ అంతర్గత పైపులైన్లు ద్వారా, 9853 నల్లా కనెక్షన్లకు, మానకొండూర్ నియోజికవర్గమునకు 14 కోట్లతో 49 గ్రామలలోని 85 ట్యాంకులకి, 104 కీ. మీ అంతర్గత పైపులైన్లు ద్వారా, 14704 నల్లా కనెక్షన్లకు, మరియు బాల్కొండ నియోజికవర్గమునకు 3 కోట్లతో 10 గ్రామలలోని 14 ట్యాంకులకి, 17 కీ. మీ అంతర్గత పైపులైన్లు ద్వారా, 1427 నల్లా కనెక్షన్లకు ప్రతి రోజూ నీరు సరఫరా చేయబడుతుంది. ఇంటింటికి నీటి సరఫరాతోపాటు పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు, ప్రార్ధనా స్థలాలు మరియు ప్రభుత్వ కార్యాలయాలకు మిషన్ భగీరథ పథకము ద్వారా నీటి సరఫరా చేయడం జరుగుతుంది. మరియు సిరిసిల్ల నియోజకవర్గంలోని అప్పారెల్ పార్కుకు, వేములవాడ నియోజకవర్గం లోని వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానమునకు మరియు చొప్పదండి నియోజకవర్గం లోని శ్రీ కొండగట్టు అంజనేయ స్వామి దేవస్థానమునకు నీటి సరఫరా జరుగుతున్నది.సిరిసిల్ల వేములవాడ, చొప్పదండి మున్సిపాలిటీకు మిషన్ భగీరథ ద్వారా బల్క్ నీటి సరఫరా జరుగుతున్నది.స్వాతంత్ర్యం వచ్చిన కానుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి మన రాష్ట్రంలో కేవలం 17 వేల నీటి ట్యాంకులు, 10 వేల కి.మీ అంతర్గత పైపులైన్లు నిర్మిస్తే, ఈ రోజు మిషన్ భగీరథ పథకం ద్వారా అదనంగా 18, 560 నీటి ట్యాంకులు, 67,000 కిలో మీటర్ల అంతర్గత పైపులైన్లు మరియూ 57 లక్షల నల్లా కనెక్షన్లు నిర్మించడం కేవలం ఒక అకుంఠిత దీక్ష ద్వారా మాత్రమే మన ప్రభుత్వం వల్లనే సాధ్యమయ్యింది.ఈ రోజు తెలంగాణ రాష్ట్రం ఒక్కటే యావత్ బారతదేశంలో, ఉపరితల నీటిని శుద్ది చేసి ఇంటింటికి స్వచ్చమైన త్రాగునీరును నయా పైసా లబ్ది దారుల నుండి తీసుకోకుండా ఉచితంగా అందిస్తుంది. అంతే కాకుండా దేశంలో ప్రతి మనిషికి 100లీ చొప్పున గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా చేసే ఏకైక రాష్ట్రం మన తెలంగాణ.ఇంతకుముందు ఉమ్మడి రాష్ట్రంలో, మహిళలు వీధిలో ఉన్న నల్లా లేదా బోరింగ్ ల దగ్గర తాగునీళ్ల పట్టుకునేవారు. ఇందుకోసం చాలా సమయం పట్టేది. శుభ్రమైన తాగునీటి కోసం చాలా దూరం పోయేవారు. ఇక ఎండాకాలంలో నీటి వనరులు ఎండిపోతే సుదూర ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ బావులు, ఇతర నీటి వనరుల దగ్గరికి వెళ్లి తాగునీటిని తెచ్చుకునే పరిస్తితి. ఇంటి అవసరాల కోసం ఇతర పనులు చేయడానికి స్త్రీలకు అవకాశం ఉండేది కాదు. అంతేకాకుండా ఆ రోజుల్లో నీటి సరఫరా కేవలం భూగర్భ జల వనరులైన బావుల ద్వారానే జరిగేది. ఇట్టి భూగర్భ జల వనరులలో నీరు మందంగా ఉండడమే కాకుండా వివిధ హానికర లవణాలు మరియూ సూక్ష్మ క్రిములు ఉండేవి. మన రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో ఫ్లోరైడ్ బాధిత గ్రామాలుఉండేవి. అధిక మోతాదులో ఫ్లోరైడ్ ఉండే నీటిని దీర్ఘ కాలం త్రాగడం వలన ఫ్లోరోసిస్ వ్యాది సోకేది. ఈ వ్యాధి మూలంగా ఎముకలు వంకర్లు తిరగడం, దంతాలు పాడవటమే కాకుండా త్వరగా ముసలితనం వచ్చేది. త్రాగునీరు సూక్ష్మ క్రిములచే కలుషితం అయినప్పుడు కలరా మరియూ టైఫాయిడ్ జ్వరాలు కూడా వచ్చేవి. అధిక మోతాదులో లవణాలుండే బావి నీటిని దీర్ఘ కాలం త్రాగడం వలన కొన్ని సార్లు మూత్రపిండాలు దెబ్బతినేవి.సమైక్య రాష్ట్రంలో కేవలం అతికొద్ది గ్రామాలకు మాత్రమే ప్రతి మనిషికి 40 లీ శుద్ది చేసిన ఉపరితల నీటిని సరఫరా చేసేవారు. ఈ రోజు తెలంగాణ రాష్ట్రంలో ప్రాంత, జిల్లా, మండల, గ్రామ, పేద, ధనిక తరతమ్యాలు లేకుండా ప్రతి ఇంటికి కూడా స్వచ్చమైన వర్షాధార జలవనరులనుండి సేకరించిన నీటిని శుద్దిచేసి నీటి నాణ్యతా పరీక్ష చేసి మరియూ తగిన మోతాదులో క్లోరిన్ కలిపి సరఫరా చేయడం జరుగుతుంది. మానవ శరీరానికి సుమారుగా 300 నుండి 450 మిల్లీ గ్రాముల ఖనిజ లవణాలు అవసరం, అట్టి ఖనిజ లవణాలు ఉండే నీటిని ఈ మంచి నీటి పథకం ద్వారా సరఫరా చేయడం జరుగుతుంది. హైదరాబాద్ లాంటి నగరాలకు ఏదైతే మంచినీరు సరఫరా అవుతోందో అలాంటి నాణ్యమైన త్రాగు నీరు ఈ రోజు మిషన్ భగీరథ పదకం ద్వారా ప్రతి పల్లెకు గ్రామగ్రామంకీ సరఫరా అవుతున్నది.ఆర్ఓ వాటర్ లో కేవలం 10 నుండి 50 మిల్లీ గ్రాముల ఖనిజ లవణాలు మాత్రమే ఉంటాయి. దీర్ఘ కాలం ఆర్ఓ వాటర్ త్రాగడం వలన కీళ్ల నొప్పులు మరియూ మోకాళ్ళ నొప్పులు వచ్చే అవకాశం ఎక్కువ.అందరూ ఇది గమనించి ఆర్ఓ వాటర్ బదులు మిషన్ భాగీరథ నీటినే త్రాగాలని మనవి. తెలంగాణ మంచి నీటి సరఫరా వ్యవస్తను పరీక్షించిన కేంద్ర ప్రభుత్వము ప్రశంసిస్తూ 2022 లో నిత్యం నీటి సరఫరా చేసే మొదటి రాష్ట్రంగా అవార్డ్ ఇచ్చింది. ఎంతో మంది రాష్ట్ర మరియూ దేశ ప్రతినిదులు తెలంగాణ మంచి నీటి సరఫరాను పరిశీలించి ఇది దేశం మొత్తం అనుసరించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ఈ రోజు మన రాష్ట్రంలో నీటి సంబంధిత వ్యాధులు లేవు, ఏ మహిళ బైటకెళ్లి నీళ్ళు తెచ్చుకోవాల్సిన పరిస్తితిలేదు ఫలితంగా చాలామేర జీవన ప్రమాణాలు పెరిగాయి. ఇట్టి మంచి నీటి సౌకర్యం కల్పించిన మన తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియచేస్తూ, ఇట్టి నీటిని సద్వినియోగం చేసుకుని మంచి నీటి వ్యవస్తను కాపాడతారని ఆశిస్తున్నాము.



## విద్యారంగం సమస్యలను పరిష్కరించాలి
### - శనిగరపు రజనీకాంత్

కరీంనగర్, జూన్ 17( వాయిస్ టుడే): భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగరపు రజనీకాంత్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగరపు రజనీకాంత్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో కనీసం మౌలిక వసతులు లేకపోవడం అనేక సమస్యలతోనే విద్యారంగం ప్రారంభం అయిన పరిస్థితి నెలకొంది అని మరియు ప్రభుత్వ అధికారులు పాఠశాలలో సందర్శించకపోవడం వాటి సమస్యలు ఎక్కడికక్కడే కనపడుతున్న పరిస్థితి నెలకొంది అని వారు అన్నారు, అనేక పాఠశాలలు శిథిలావస్తులలో ఉండడం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిలో విద్యార్థులు అయోమయంలో ఉండడం చాలా బాధాకరమని వారు అన్నారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు, రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని, మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో కేజీబీవీ లలో ఖాళీగా ఉన్న లెక్చర్ పోస్టులను భర్తీ చేయాలని సరిపడా అధ్యాపకులు లేక చదువుకు నోచుకోలేనీ పరిస్థితిలో విద్యార్థులు ఉన్నారని దానితో పాటు ప్రవేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయకపోవడం ద్వార ఇష్టానుసారంగా విద్యార్థుల దగ్గర్నుండి దోచుకున్న పరిస్థితి నెలకొందని యూనిఫామ్ పుస్తకాల పేరిట అధికంగా వసూలు చేస్తున్నారు అని ప్రభుత్వ నిబంధనలను విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేయడం జరిగింది. పరిష్కరించని యెడల రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కపెల్లి పూజ,జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ ,జిల్లా ఉపధ్యక్షులు తిప్పరపు రోహిత్,జిల్లా సహాయ కార్యదర్శి అసంపెల్లి వినయ్ సాగర్ పాల్గొన్నారు.




## చదువుతో మంచి స్థానాన్ని పొందవచ్చు, పిల్లలు అందరు బడిలో ఉండాలి, బడిలో ఉంటే మంచి రక్షణ ఉంటది
### -సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్

కరీంనగర్, జూన్ 17 (వాయిస్ టుడే): చెల్డ్ హెల్ప్ లైన్ 1098 మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం వారోత్సవాల అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కరీంనగర్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ %ఐ% సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ పాల్గొని బాల కార్మిక చట్టం, పిల్లల పై లైంగిక నేరాల నిరోధక చట్టం, ఆపద ఉన్నప్పుడు న్యాయ సహాయం ఏవిధంగా పొందవచ్చు అనే అంశాల పై అవగాహన కల్పించారు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సంపత్ మాట్లాడుతు ఆడపిల్లలు స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా, సినిమాలు ప్రభావం తో ఎలా మోసపోతున్నారు, వాటి నుండి ఎలా రక్షణ పొందవచ్చు అనే అంశాల పైన అవగాహన కల్పించారు. ఏదైనా ఆపద ఉంటే 1098, 100, 181 కి కానీ ఫోన్ చెసి సహాయం పొందాలని అన్నారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సంపత్, లీగల్ ఎడ్ కౌన్సిల్ టి.మహేష్ , కె జి బి వి స్పెషల్ ఆఫీసర్ శ్రీలత , చైల్డ్ హెల్ప్ లైన్-1098 టీమ్ మెంబెర్స్ పుష్పలత,నరేంద్ర మరియు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత
### గిరిజనుల బడ్జెట్లో 70శాతం విద్యకొరకు వినియోగం
### శిక్షణ జాయింట్ కలెక్టర్ నవీన్ నికోలస్

సైదాపూర్, (వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తుందని విద్యకు పెద్దపీట వేసిన ఎకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనని శిక్షణ సంయుక్త కలెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. శనివారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సైదాపూర్ మండలం రాయికల్ తండాలో నిర్వహించిన తెలంగాణ గిరిజనోత్సవంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. తండా ప్రజలు సాంప్రదాయ నృత్యాలతో అయన కు స్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా శిక్షణ కలెక్టర్ నవీన్ నికొలస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి పూర్వం సరైన అవకాశాలను కల్పించకపోవడం వలన విద్యావ్యవస్థ కుంటుపడి పోయిందని, తెలంగాణ రాష్ట్రం సాదించుకున్న దశాబ్ద కాలంలో గిరిజనుల కొరకు అనేక పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు.గతంలో ఉన్నటువంటి దాదాపు 2వేల పైచిలుకు గిరిజన సంక్షేమశాఖ విద్యాసంస్థలను ఇంగ్లీష్ మీడియం గా మార్చా రన్నారు. విద్యకు అత్యంత ప్రాదాన్యమిస్తు గిరిజనుల కోసం జారిచేస్తున్న బడ్జెట్ లో 70శాతం వరకు విద్యకోసమే వాడుతున్నారని, రాష్ట్రంలో 92 కొత్తగురుకులాలను, 22 డిగ్రీ కళాశాలలను ప్రారంభించడం జరిగిందని అందులో 1 కరీంనగర్ జిల్లాలో కూడా ట్రైబల్ డిగ్రీ కళాశాలను మంజూరు చేశారన్నారు.దేశంలో ఎక్కడా కూడా లా, డిగ్రి పిజి, సైనిక్ రెసిడెన్సి కళాశాలలు లేవని, మెట్టమొదటి సారి తెలంగాణలో ప్రారం భించారన్నారు. గిరిజనులకు 100యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, తండాలు, గూడెంలను నూతన పంచాయతీలుగా మార్పు చేయడం జరిగిందని గిరిజనుల అభివృద్ధికి సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేయడం జరుగు తుందన్నారు. గిరిజనులకు ఆత్మగౌరవం కల్పించే విధంగా హైదరాబాదులో ఆదివాసి, బంజారా భవనాలను నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్ రెడ్డి, ఎంపీడీవో పద్మావతి , తహసిల్దార్ బాబు సింగ్, సర్పంచ్ బర్మావత్ అక్షయ, నాయకులు రాజయ్య, హెచ్ డబ్ల్యు ఓ హసీనా బేగం, శంకర్ నాయక్, ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సీతారాంపూర్లోని చెరువు స్థలాన్ని కాపాడాలి

### లేకుంటే పేదలచే జెండాలు పాతుతాం

### సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు



కరీంనగర్, జూన్ 17 (వాయిస్ టుడే): జిల్లాలోని కొత్తపల్లి మండల పరిధిలో గల సీతారాంపూర్ చెరువు శిఖం భూమి సర్వే నంబర్ 71 లో 13 ఎకరాల 23 గుంటలు ఉండేదని దానిని కొందరు వ్యక్తులు కొన్ని రోజుల నుండి నుండి కబ్జా చేస్తున్నారని వెంటనే ప్రభుత్వ అధికారులు స్పందించి స్థలాన్ని కాపాడాలని ఆయన కోరారు. చెరువులో ఎలాంటి కట్టడాలు చేయొద్దని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్న శిఖం భూమిని దాదాపు 4,5 ఎకరాల స్థలాన్ని ఇప్పటికే కబ్జా చేశారని కబ్జా దారులను శిక్షించడంలో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ మధ్యకాలంలో ఈ శిఖం భూముల నుండి రహదారిని వేస్తున్నారని ఇది దుర్మార్గమైన చర్య అని ఈ యొక్క భూమిలో అపార్ట్మెంట్ లు నిర్మించాలని చూస్తున్నారని వీటికి పర్మిషన్ ఎలా ఇస్తున్నారు అని దీనికి మున్సిపల్ అధికారులు సమాధానం చెప్పాలన్నారు పక్కకు ఉన్న సర్వే నెంబర్ల వారు ఈ స్థలాన్ని కొంత కలుపుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని దాదాపు ఈ స్థలంలో గుంటకు 40 లక్షల రేటు పలుకుతుందని ఇంత విలువ గల భూమి అన్యాక్రాంతమవుతుంటే పట్టించుకునే నాధుడే లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకే కొమ్ము కాయడం అధికార పార్టీ అండదండలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరజిల్లుతుందని అన్నారు స్థానిక మంత్రి వెంటనే చొరవ తీసుకొని ఈ స్థలాన్ని కాపాడి ప్రజలకు ఉపయోగపడే విధంగా దీనిని ఉపయోగించాలని లేనిపక్షంలో ఆ ప్రాంతంలో ఉన్న పేదలకు ఇండ్ల కోసం ఆ స్థలంలో ఎర్రజెండాలు పాతుతామని ఆయన తెలిపారు. నిరుపేదలు ఆరడుగుల జాగా కావాలని ఆందోళన చేస్తే హడావుడి చేసి అరెస్టులు చేసే అధికారులకు కబ్జాలు కనబడకపోవడం సిగ్గుచేటు అని ఆక్రోషం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తహసిల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న ఇలాంటి స్థలాలనే కాపాడ లేని స్థితిలో అధికారులు ఉండడం విస్మయానికి గురి చేస్తుందని కబ్జాదారులకు అధికారుల అండదండలు ఉన్నాయని అనుమానాలు వస్తున్నాయన్నారు. అనుమానాలు ప్రజలకు నివృత్తి కావాలంటే వెంటనే అధికారులు 71 సర్వే నెంబర్ లో ఉన్న శిఖం భూమి కాపాడాలని ఆయన అన్నారు. లేని పక్షంలో సిపిఐ ప్రజ ఉద్యమం చేపడుతుందని పైడిపల్లి రాజు ఒక ప్రకటనలో హెచ్చరించారు.

## అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ రైస్ పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు



రాజన్న సిరిసిల్ల జూన్ 17 (వాయిస్ టుడే) : టాస్క్ ఫోర్స్ ఎస్.ఐ మారుతి తన సిబ్బంది తో కలిసి నమ్మదగిన సమాచారం మేరకు కొనరావుపేట్ మండలం కొండాపూర్ గ్రామం నుండి సిరిసిల్ల లోని లక్ష్మీ ఇండస్ట్రీస్ కి గుంట సంయోల్, 20 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యం ను టీఎస్ 01 యుబి 4798 అను నెంబర్ గలా ట్రాలీ ఆటోలో తరలిస్తుండగా సిరిసిల్ల రగుడు చౌరస్తా వద్ద పట్టుకొని ఆటోలు, రేషన్ బియ్యంను స్వాధీన పరుచుకొని అదుపులోకి తీసుకోని తదుపరి చర్యల నిమిత్తం ఆటోలను, పిడిఎస్ రైస్ ను సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్లో అప్పగించడం జరిగింది.ఈ సందర్భంగా టాస్ఫోర్స్ ఎస్.ఐ లు మాట్లాడుతూ పేదలకు అందవలసిన ప్రభుత్వం రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసిన, రవాణా చేసే వాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టాస్క్ లో టాస్ఫోర్స్ ఎస్.ఐ లు మారుతి,శ్రీకాంత్, రాజేష్, తిరుపతి,మహిపాల్,శ్రీనివాస్,మహిపాల్, అక్బర్,సమీయొద్దీన్, పాల్గొన్నారు.

# చందుర్తి మండలంలోని దేవుని తండాలో ఘనంగా గిరిజనోత్సవం

**20 లక్షలతో నూతన గ్రామపంచాయతీకి శంకుస్థాపన**

**-గిరిజన అభ్యున్నతికి, ఆత్మ గౌరవానికి పెద్దపీట!**

**-చెన్నమనేని రమేష్ బాబు**



రాజన్న సిరిసిల్ల /వేములవాడ జూన్ 17( వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నేడు గిరిజన దినోత్సవం సందర్భంగా దేవునితాండ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చెన్నమనేని రమేష్ బాబు, మాట్లాడుతూ దశాబ్దాలుగా అణిచివేయబడిన తాండలు నేడు గ్రామపంచాయతీలుగా చేసుకోని స్వీయ పరిపాలనలో అభివృద్ధి చేసుకుంటున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజన సంక్షేమం కొరకు చేస్తున్న సంస్కరణలు దేశానికే దిక్సూచిలా ఉన్నాయని పార్లమెంటు సాక్షిగా కేంద్ర గిరిజన శాఖ మంత్రి తెలిపారు.తెలంగాణ రాష్ట్రం రాకముందు 2000 సంవత్సరంలో జర్మని నుండి కోటి రూపాయలు తీసుకొచ్చి ఎర్ర చెరువు పటేల్ చెరువు అనుసంధానం చేసి ఇక్కడి ప్రాంతానికి నీళ్ళు అందించే కార్యక్రమం ఆనాడు జరిగిందన్నారు. అప్పటి నుండి దేవునితాండ, జలపతితాండా లతో 23 ఏండ్ల అనుబంధం ఏర్పడిందని అన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ కింద నిధులు మంజూరు చేసుకొని మిగిలిన అన్ని కార్యక్రమాలు చేసుకుందామని అన్నారు. వచ్చే మాసంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కొరకు గృహలక్ష్మి పథకం కింద మూడు లక్షల రూపాయలు ఇచ్చే కార్యక్రమం ప్రారంభం కాబోతున్నదని అర్హులైన ప్రతి ఒక్కరికి పారదర్శకంగా అందిస్తామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోడుభూముల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ పరిష్కారం చేస్తారని అందుకోసమే కమిటివేసి రెవెన్యూ మరియు అటవీశాఖ వారితో సర్వే జరిపిస్తున్నారని పోడు భూముల సమస్యలు తప్పకుండా పరిష్కారం చేస్తారని అన్నారు.

అనంతరం 20 లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇప్పటివరకు మన దేవునితాండ లో జరిగిన అభివృద్ధి పనుల వివరాలు గ్రామ పంచాయతీ భవనానికి 20లక్షలు, ఆర్.ఓ ప్లాంట్ కు 3లక్షలు, 172 మంది రైతులకు రైతుబంధు ద్వారా దాదాపు 68లక్షలు, 18మందికి కల్యాణ లక్ష్మీ ద్వారా 18లక్షలు, 301 మందికి నెలకు పెంక్షన్ ల ద్వారా దాదాపు 6లక్షలు, మహిళ భవనంకు 5లక్షలు, ఎస్.టి కమ్యూనిటీ హాల్ కు 5లక్షలు, 50లక్షలతో సి.సిరోడ్లు వేసుకున్నామని అన్నారు. మనం పంపిన ప్రపోసల్స్ జలపతి తండా నుండి గోవింద రావు పేట రోడ్డు కొరకు, 1కోటి 10లక్షలు, దేవునితాండ నుండి జలపతితండా కు రెనివల్ రోడ్ కొరకు, జలపతితండాకు ఆర్.ఓ ప్లాంట్ కొరకు, జలపతి తండా మహిళ భవనం కొరకు, సేవాలాల్ దేవాలయానికి ప్రహరీ గోడ కొరకు, సి.సి రోడ్ల కొరకు మంజూరుకు పంపాము.ఎంపీపీ బైరవని లావణ్య. సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, జెడ్పిటిసి నాగం కుమార్, ఫ్యాక్స్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, మండల అధ్యక్షులు మ్యాకల ఎల్లయ్య, సర్పంచులు, ఎం.పి.టి.సీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## బి సి రుణాల అప్లికేషన్ గడువు పెంపొందించాలని సిఐటియు డిమాండ్

రఘునాథపల్లి, జూన్ 17, (వాయిస్ టుడే): బీసీ రుణాల పేరుతో ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తున్నారని సీఐటీయూ మండల కన్వీనర్ పొదల నాగరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం సిఐటియు మండల కన్వీనర్ పదర నాగరాజు మాట్లాడుతూ.. ఎంబీసీ కులాల కు 1లక్ష ర్రుపాయల రుణం కొసం ఆదాయం సర్టిఫికేట్ కోసం గత10రోజుల నుండి మీ సేవ కేంద్రం,మండల ఆఫిస్ చుట్టూ తిపుకుంటు సర్వర్ పనిచేయడం లేదని సర్టిఫికేట్ యివ్వకుండ ప్రజలు ఆప్లికెషన్ పెట్టుకోకుండా మోసం చేస్తున్నారని అన్నారు. అప్లికేషన్ చివరి తేది జూన్20 కాకుండా జులై30 వరకు గడువు పెంచల్సిందిగా ప్రభుత్వ ని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో పొదల శ్రీనివాస్, ఆమనగంట్టి శంకర్, బాస్కర్, రజవ్వ, జ్యోతి,శిరీష, రాజు, రమేష్,శంకరయ్య, రామ్ తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ స్టేషన్ నిర్వాహనపై మోడల్ స్కూల్ విద్యార్థులకు అవగాహన

**-కోనరావుపేట ఎస్సై రమాకాంత్**

రాజన్న సిరిసిల్ల /వేములవాడ, జూన్ 17( వాయిస్ టుడే) : కోనరావుపేట ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్లో మోడల్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు పోలీస్ స్టేషన్ నిర్వహణపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు ఉపయోగిస్తున్న టెక్నాలజీ గురించి, రిసెప్షన్, స్టేషన్ రైటర్, వి హెచ్ ఎఫ్ సెట్, టెలికాన్ఫరెన్స్, ఆన్ లైన్ ఎఫ్ఐఆర్, పార్టు మ్యాప్, ఆయుధాలు భద్రపరచు రూమ్, 9ఎం ఎం పిస్టల్, ఇతర ఆయుధాల గురించి, టీఎస్ కాప్ అందులో ఉన్న ఫ్యూచర్స్ గురించి, సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాల వల్ల కలిగే ఉపయోగాలు గురించి మైనర్ డ్రైవింగ్ చేయవద్దని మోటార్ వాహనాల చట్టాలు వివిధ రకాల బందోబస్తు గురించి, పోగొట్టుకున్న ఫోన్ సిఇఐఆర్ అప్లికేషన్ ద్వారా దొరికే విధానం వివిధ రకాల గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాస్ రెడ్డి, రఘుపతి, కానిస్టేబుల్ లు సత్యం, ఇమ్రాన్, శ్రీధర్ సిబ్బంది, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉన్నారు.

## ఇసుక ట్రాక్టర్ ఢీ అక్కడికక్కడే వ్యక్తి మృతి



రాజన్న సిరిసిల్ల /వేములవాడ, జూన్ 17 (వాయిస్ టుడే): వేములవాడ మండల కేంద్రంలో ఇసుక ట్రాక్టర్ ఢీకొని లాలపల్లికి చెందిన తేలు కనకయ్య (45) మృతి చెందాడు. చెక్కపల్లి నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్ బైక్ పై వెళ్తున్న కనకయ్యను ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కనకయ్యకు ముగ్గురు కూతుర్లు, కొడుకు ఉన్నట్లు బంధువులు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అట్టహాసంగా మర్రి రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ కెవి రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్**



మేడ్చల్: మల్కాజ్గిరి జిల్లా పార్లమెంట్, కంటోన్మెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా బిఆర్ఎస్ కెవి రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన సందర్భంగా కేటీఆర్ పెట్టిన గిఫ్ట్ స్మైల్ కార్యక్రమం లో భాగంగా హెచ్ఎంటి లోని నిర్మన్ అసోసియేషన్ ఫర్ ద ఇంటర్నేషనల్ డిసబ్లెండ్ ఒకేషనల్ ట్రెండింగ్ ప్రోడక్ట్ సెంటర్ లో ఉన్న ఆశ్రమంలో నెలకు సరిపడా నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవిసింగ్ మాట్లాడుతూ ఐటీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పెట్టినటువంటి ఈ కార్యక్రమంలో నా వంతు సహాయం చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ చారి, సంతోష్ గౌడ్, మనోజ్ కుమార్, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



భువనగిరి వాయిస్ టుడే : తెలుగుదేశం పార్టీ భువనగిరి మండలం ప్రధాన కార్యదర్శి ఎనబోయిన కనకరాజు గారి తండ్రి ఇటీవలే అనారోగ్యనికి గురికావడం జరిగింది అది తెలుసుకున్న భువనగిరి నియోజకవర్గం ఇంచార్జ్ మన్నె సంజీవరావు గారు వారి తండ్రి పరామర్శించి వారికీ వారి కుటుంబనికి ధర్యం చెప్పడం జరిగింది ఈ కార్యక్రమం భువనగిరి మండల అధ్యక్షులు ఎర్రబోయిన రమేష్ యాదవ్, రేగు బీరప్ప, తదితరులు పాల్గొన్నారు...



## తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చడంతోనే స్వయం పరిపాలన సాధ్యమైంది

**జిల్లా వ్యాప్తంగా 25 తండాలు గ్రామ పంచాయితీలుగా**

**జిల్లా అదనపు కలెక్టర్ బి.సత్య ప్రసాద్**

రాజన్న సిరిసిల్ల/ వీర్నపల్లి, జూన్ 17 (వాయిస్ టుడే) : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం తెలంగాణ గిరిజనోత్సవాన్ని పురస్కరించుకుని వీర్నపల్లి మండలం ఎర్రగడ్డ తండాలో నిర్వహించిన వేడుకలకు అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గత పదేండ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని అందరికీ తెలిపే విధంగా రోజుకో కార్యక్రమంతో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో 25 తండాలను గ్రామ పంచాయితీలుగా మార్పు చెందాయని, దీని ద్వారా గిరిజన ప్రజలకు స్వయం పరిపాలన సాధ్యమైందని అన్నారు. స్థానికంగా ఉన్న వారు గ్రామాలను పాలిస్తేనే సమస్యల మీద అవగాహన ఉంటుందని గమనించి, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేకంగా తండాలను గ్రామ పంచాయితీలుగా మార్పు చేయాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తండాలు గ్రామ పంచాయితీలుగా మారిన తర్వాత గ్రామాల్లో అనేక మార్పులు వచ్చాయని, రోడ్లు, డ్రైనేజీలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, కంపోస్ట్ షెడ్ లు, నర్సరీలు, గ్రామ పంచాయితీ భవనాలు తదితర అభివృద్ధి పనులను చేసుకున్నామని అన్నారు. ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం అనేక చర్యలు తీసుకుంటుందని, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించేందుకు రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను సంరక్షిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. హైదరాబాద్ లో గిరిజనుల కోసం సేవాలాల్ భవన్, ఆదివాసి భవన్, ఆత్మగౌరవ భవనాలను ప్రభుత్వం నిర్మించిందని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, జెడ్పిటిసి గుగులోతు కళావతి, ఎంపీడీవో నరేష్, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, సర్పంచ్ జగ్మాల్ నాయక్, డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## బోయినిపల్లి గ్రామంలో అలరిస్తున్న చిరుతల రామాయణ నాటకం

**నేటికీ ప్రాచీన కళలను ఆదరించడం హర్షణీయం**



రాజన్న సిరిసిల్ల/బోయినిపల్లి జూన్ 17 (వాయిస్ టుడే) బోయినిపల్లి మండల కేంద్రంలో వేసవికాలక్షేపంలో భాగంగా శుక్రవారం రాత్రి రాజన్న సిరిసిల్ల జిల్లా మహాభారత కళాకారుల అధ్వర్యంలో చిరుతల రామాయణ నాటక ప్రదర్శనలను మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. స్థానిక సర్పంచ్ గుంటి లతాశ్రీ-శంకర్ మాట్లాడుతూ మూడురోజుల నాటక కళా ప్రదర్శనలో భాగంగా మొదటి రోజైన శుక్రవారం రాత్రి ప్రదర్శించిన నాటకంలో రావణాసురుడు పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుందని, రావణాసురుడు పాత్ర పోషించిన శ్రీనివాస్ ను ఈ సందర్భంగా అభినందించడం జరిగిందని, కంప్యూటర్ కాలంలో కూడా ప్రాచీన కళలను ఆదరించడం హర్షణీయమని కళాకారులందరూ పోటీపడి ఉత్తమ కళలను ప్రదర్శించారని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక కళాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు యెల్ల పోశెట్టి,ప్రధానకార్యదర్శి వరాల దేవయ్య, నటకేసరి నర్సింగం,జడ్పీటీసీ కత్తెరపాక ఉమా కొండయ్య, ఎంపిటిసి సంబ బుచ్చమ్మ-లక్ష్మీరాజం, స్థానిక ప్రజాపతి నిధులు,నాయకులు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు చేయండి - అధిక ఆదాయం పొందండి

**మొక్క నాటిన 4వ ఏట నుండి 30 ఏండ్ల దాకా నిరంతర ఆదాయం**

**సబ్సీడీలు పొందండి - ప్రభుత్వ సాయం అందుకోండి-ఇంచార్జ్ మండల వ్యవసాయ అధికారిణి అనూష**

**మండలంలో 200 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు పూర్తి**

**మరో 300 ఎకరాలకు సిద్ధమౌతున్న రైతులు-వ్యవసాయ విస్తరణ అధికారి అక్షయ్**



జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 17(వాయిస్ టుడే): జగిత్యాల జిల్లా బుగ్గారం మండల రైతులంతా ఆయిల్ పామ్ సాగు చేసి అధిక ఆదాయం పొందాలని మండల ఇంచార్జ్ వ్యవసాయ అధికారిణి అనూష అన్నారు. శనివారం స్థానిక రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారి అక్షయ్ అధ్యక్షతన బుగ్గారం క్లస్టర్ పరిధిలోని రైతులతో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మండల ఇంచార్జ్ వ్యవసాయ అధికారిణి అనూష ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సబ్సీడీపై ఒక్కొక్క మొక్కకు కేవలం రూపాయలు 20లకే కావాలిసినన్ని మొక్కలు అందజేస్తారని తెలిపారు. డ్రిప్ పద్దతిలో నీరు అందజేసేందుకు డ్రిప్ పరికరాలు కూడా 80 నుండి 100 శాతం సబ్సీడీ లో ఇస్తారని పేర్కొన్నారు. అంతే కాకుండా ఆయిల్ పామ్ పంట సాగు చేస్తున్న రైతులందరికీ ప్రభుత్వం ద్వారా మూడేండ్ల పాటు పంట సాగు సాయం నేరుగా బ్యాంక్ ఖాతాలోకి వస్తాయన్నారు.మొక్క నాటిన 4వ ఏట నుండి 30 ఏండ్ల దాకా నిరంతర ఆదాయం పొందవచ్చని సూచించారు. అంతర్ పంటలు కూడా సాగు చేసి రైతులు ఆదాయము పొందవచ్చునని వివరించారు. బుగ్గారం మండల రైతులంతా వీలైనంత ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేయాలని ఆమె రైతులను కోరారు. రైతులు అడిగిన పలు సందేశాత్మక ప్రశ్నలకు ఆమె సమాధానము చెప్పి అవగాహన కల్పించారు. ఈ సీజన్ లో ఆయిల్ పామ్ సాగు చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన మొదటి రైతు, సీనియర్ జర్నలిస్ట్ చుక్క గంగారెడ్డి ద్వారా ఆమె దరఖాస్తు స్వీకరించారు. సదస్సు అనంతరం ఆయిల్ పామ్ సాగు కు సంబంధించిన కరపత్రాన్ని రైతులతో కలిసి వ్యవసాయ అధికారిణి అనూష, విస్తరణాధికారి అక్షయ్ లు ఆవిష్కరించారు.ఈ సదస్సులో వ్యవసాయ విస్తరణ అధికారి అక్షయ్ మాట్లాడుతూ గత పంట కాలంలోనే బుగ్గారం మండలంలో 200 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేయడం జరిగిందన్నారు. ఈసారి మరో 300 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేసేందుకు రైతులు సిద్ధమౌతున్నారని తెలిపారు. రైతులకు ఆయిల్ పామ్ సాగుపై ఎలాంటి సందేహాలు ఉన్నా నేరుగా సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చునని తెలిపారు. ప్రకృతిలో కాలక్రమేణా వస్తున్న మార్పుల వలన రైతులు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గత ఏడాదికంటే ఈసారి ముందుగానే వ్యవసాయ పనులు ప్రారంభించి విత్తనాలు నాటాలని తెలిపారు. వ్యవసాయానికి సంబంధించిన పలు ముఖ్యమైన సూచనలు రైతులకు ఆయన అందజేశారు. పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడి, అధిక ఆదాయం పొందాలని ఆయన కోరారు.

### అపోహలు వద్దు - ఆయిల్ పామ్ సాగే ముద్దు-రైతు కొమ్మునేని తిరుపతి

రైతులకు ఎలాంటి ఆపోహలు వద్దు మనకు ఆయిల్ పామ్ సాగు ఎంతో ముద్దు అని 11 ఎకరాలలో సాగు చేసిన రైతు కొమ్మునేని తిరుపతి పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగులో తన అనుభవాన్ని ఈ సదస్సులో రైతులకు వివరించారు. గత ఫిబ్రవరిలో తన 11 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేశానని, పంట ఎదుగుదల చాలా బాగుందని తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఎకరానికి రూపాయలు 4,200 చొప్పున పంట సాయం కింద ప్రోత్సాహం కూడా అందిందన్నారు. గోపులాపూర్ లో మూడెకరాలో ఆయిల్ పామ్ సాగు చేసిన రైతు తుమ్మల రాజేష్ తన అనుభవాన్ని ఈసదస్సులో రైతులకు వివరించారు. ఈ సదస్సులో ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జంగ శ్రీనివాస్, రైతు నాయకులు మసర్తి రాజిరెడ్డి, పొలంపెల్లి మల్లేశం, చుక్క గంగారెడ్డి, దసర్తి పూర్ణచందర్, సుంకమ్ ప్రశాంత్, గంజి జగన్, కొమ్మునేని తిరుపతి, తుమ్మల రాజేష్, మసర్తి రాజన్న, కొల్లూరి గంగారెడ్డి, దసర్థి రవి, బొద్దుల నరహరి, బుక ప్రవీణ్, కళ్లెం నాగేష్, కొడిమ్యాల తిరుపతి, గుర్రాల గంగారాం, పరుమాల కొమురయ్య, కేతి రాజమల్లయ్య, మసర్తి నర్సయ్య, తదితరులు హాజరయ్యారు.

# కేసుల సత్వర పరిష్కారం మే అందరి ధ్యేయం కావాలి: హైకోర్టు జడ్జిలు

## మెదక్ కోర్టు సముదాయంలో ఐదు కోట్ల రూపాయల వ్యయంతో మూడంతస్తుల భవనానికి శంకుస్థాపన



మెదక్,జూన్ 17, 2023 (వాయిస్ టుడే): కేసుల సత్వర పరిష్కారమే అందరి ధ్యేయం కావాలని హై కోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్ అన్నారు. కోర్టులకు వెళ్ళితే సత్వర న్యాయం జరుగుతుందనే నమ్మకం కక్షిదారులల్లో కలిగేలా న్యాయ వ్యవస్థ పనిచేయాలని హితవు పలికారు. శనివారం మెదక్ కోర్టు సముదాయంలో 5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న మూడవ అంతస్తు భవన నిర్మాణానికి హై కోర్టు జడ్జీలు జస్టిస్ నవీన్ రావు, జస్టిస్ సంతోష్ రెడ్డి, మెదక్ ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి లక్ష్మి శారద, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జెన్నా రెడ్డి, గార్లపాటి సురేష్ , న్యాయవాదులు ప్రభుత్వ అధికారుల తో కలిసి శంఖు స్థాపన చేశారు. ఈ సందర్భముగా చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మాట్లాడుతూ కేసులు త్వరితగతిన పరిష్కారం కావాలని, 25-30 ఏళ్ల తరబడి కేసులు పెండింగులో ఉండడం మంచిది కాదని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరచిన చట్టాలకనుగుణంగా అందరు నడుచుకొని పెండింగు కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. న్యాయ వ్యవస్థకు బార్ - బెంచ్ రెండు చక్రాలంటివని, రెండు సక్రమంగా పనిచేస్తేనే కేసులు సత్వర పరిష్కారమై కక్షిదారులకు న్యాయం చేకూర్చినవారవుతామన్నారు. మౌళిక వసతులు సక్రమంగా ఉన్నప్పుడే కోర్టుల నిర్వహణ సజావుగా సాగుతుందన్నారు. అందుకోసమే రాష్ట్రంలోని కోర్టులకు బిల్డింగ్ లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఇక్కడ కోర్టు సముదాయంలో లో ఉన్న ఆరు కోర్టులకు భవనం సరిపోవడం లేదనే 3వ అంతస్థు నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు జెన్నా రెడ్డి, న్యాయవాదులు గార్లపాటి సురేష్ , రవీందర్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, అకుల శ్రీనివాస్,సిరిగెకరుణకరు,పిపి ఫజల్, లక్ష్మణ్ , పోచయ్య చీఫ్ జస్టిస్ కు వినతి పత్రం అందజేస్తూ మొబైల్ కోర్టును అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కోర్టు గా అప్ గ్రేడ్ చేయాలని 10 ఎకరాల సువిశాల కోర్టు సముదాయం ఉన్నందున వాంగల్ లో 33 కోట్ల తో చేపడుతున్న మోడల్ కోర్టు సముదాయం మాదిరే ఇక్కడ ఆఫీసర్స్ క్వార్టర్స్, కోర్ట్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మెదక్ చర్చిని సందర్శించి ప్రత్యేక ప్రార్ధనలు చేసి చర్చి ప్రాశస్త్యతను పాస్టర్ ద్వారా తెలుసుకున్నారు. ఆ తరువాత ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ పాలకమండలి పూర్ణ కుంభంతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాతో సన్మానించి అమ్మవారి చిత్రపటం బహుకరించారు. ఈ కార్యక్రమంలో అడ్వొకేట్ జనరల్ బి.వి.ప్రసాద్ రావు, న్యాయమూర్తులు, న్యాయవాదులు , అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రమేష్, రెడ్ క్రాస్ సొసైటీ నాయకులు రాజశేఖర్ రెడ్డి, ఏడుపాయల ఈఓ సారా శ్రీనివాస్ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో రానున్నది మళ్ళీ బిఆర్ఎస్ ప్రభుత్వమే : మంత్రి కొప్పుల

పెద్దపల్లి జిల్లాబీ (వాయిస్ టుడే) తెలంగాణలో మళ్ళీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గ పరిధిలో 550 లక్షలతో ఖమ్మంపల్లి - ఓడెడు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఖమ్మంపల్లి -భూపాలపల్లి మార్గంలో 5000 లక్షలతో నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, జెడ్పిచైర్మన్ పుట్ట మధుకర్ తో కలిసి మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, భూపాలపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీ హర్షిణి, మంథని మున్సిపల్ చైర్మన్ శైలజ, పలువురు ఎంపీపీ లు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్ లు, ఇతర ప్రజా ప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు.



## తారు రోడ్డును వెంటనే వేయాలి లేదంటే ధర్నా రాస్తారోకోలు తప్పవు?

దుబ్బాక (వాయిస్ టుడే) :జూన్ 17, సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీలోని పెద్ద చెరువు కట్ట మత్తడిపై 60 లక్షలతో బ్రిడ్జి నిర్మించారు. దీంతో లచ్చపేటలో బ్రిడ్జి పక్కన ఉన్న ఇల్లు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు కాంట్రాక్టర్లకు ఎన్నిసార్లు విన్నవించిన తారు రోడ్డు వేయకపోవడంతో శనివారం లచ్చపేట ప్రజలు ధర్నా నిర్వహించారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడ భారీగా నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ బుధవారం వరకు పనులు పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ సందర్భంగా దుబ్బాక లచ్చ పేట మధ్యలో నూతనంగా నిర్మించిన బ్రిడ్జి పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారంటూ వార్డు ప్రజలు ఆందోళన చెందుతున్నారు గతంలో నిర్మించి దాదాపు సంవత్సరం కంటే ఎక్కువ కాలం గడిచిన బ్రిడ్జిపై తారు రోడ్డు వేయకపోవడంతో దుమ్ము ధూళి ఇళ్లలోకి చేరడంతో అనారోగ్యం బారిన పడుతున్నారు అంటూ వార్డు ప్రజలు మండిపడుతున్నారు. ఈ రహదారిలో వివిధ గ్రామాలకు వెళ్లే 20 గ్రామాల ప్రయాణికులు వాహనదారులు సైతం దుమ్ము దూళి వలన చాలా ఇబ్బందికి గురవుతారంటూ రోడ్డుపై బైఠాయించడం జరిగిందని వెంటనే బ్రిడ్జి పనులు పూర్తి చేయకపోతే వార్డు ప్రజలు పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకోలు చేపడతామంటూ హెచ్చరిస్తున్నా అని ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధిరాములు, వార్డు ప్రజలు తెలిపారు. వచ్చే బుధవారం కల్లా బ్రిడ్జి పనులు పూర్తి చేయిస్తానంటూ వార్డు కౌన్సిలర్లు నాయకులు హామీ ఇచ్చారు.



## ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవల్ చెక్ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టరు శ్రీనివాసరెడ్డి

భువనగిరి,జూన్ 17 (వాయిస్ టుడేప్రతినిధి):- జిల్లా కలెక్టరేటు సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవల్ చెక్ కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షములో మాక్ పోల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టరు డి.శ్రీనివాసరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.ఎస్.పి. పార్టీ నుండి బట్టు రామచంద్రయ్య, సి.పి.ఐ. నుండి ఏశాల అశోక్, సి.పి.ఐ. ఎం. నుండి కొండమడుగు నర్సింహ్మా, సి.పి.ఐ. నుండి పుట్ట రమేశ్, బి.జె.పి. నుండి వి.భాస్కర్, బి.జె.వై.ఎం. నుండి కె.రమేశ్, కాంగ్రెస్ నుండి బి.శ్రీకాంత్,కాంగ్రెస్ నుండి జి.రాహుల్ , వై.ఎస్.ఆర్.టి.పి. నుండి ఎం.డి.అతహర్, ఎన్నికల విభాగం డిప్యుటీ తహశీలుదారు సురేశ్, అధికారులు పాల్గొన్నారు.

## మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ

ఖమ్మం: నడిచి వెళ్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసు గుర్తుతెలియని వ్యక్తి లాక్కుని వెళ్లిన సంఘటన శుక్రవారం రాత్రి ఖమ్మం నగర పరిధిలో జరిగింది. రఘునాథపాలెం మండలం రేగుల చిలక కు చెందిన వంకాయలపాటి సీతమ్మ శుక్రవారం నగరంలోని రాఘవయ్య నగర్ లో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్తుంది. గొల్లగూడెం రోడ్ లో ఆటో దిగి రాఘవ నగర్ రోడ్ నెంబర్ 6లో నడిచి వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలోని సుమారు మూడు తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. దీంతో బాధితురాలు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## నేటితో ముగియనున్న బుక్ ఫెయిర్

ఖమ్మం: గత వారం రోజులుగా వందలాది పుస్తకాలతో లకారం ట్యాంక్ బండ్ వేదికగా జరుగుతున్న పుస్తక మహోత్సవం ఆదివారంతో ముగిసింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ పుస్తక ప్రదర్శనలో చరిత్ర, నవలలు, జీవిత చరిత్రలు,రాజకీయ విజ్ఞానం, ఆరోగ్యం, సమకాలీన రాజకీయాలు, భాషా సాహిత్యాలు, విద్య, వ్యక్తిత్వ వికాసం సామాజిక శాస్త్రం, బాల సాహిత్యం వంటి విభిన్న రకాల పుస్తకాలు పుస్తక ప్రియుల కోసం అందుబాటులో ఉన్నాయి.



## రైతులకు సంబంధించిన డబ్బులు రైతుల అకౌంట్లో జమ చేయాలి

### బీజేపీ పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కోడిపెల్లి గోపాల్ రెడ్డి

జగిత్యాల జిల్లా ప్రతినిధి (జూన్ 17,23)వాయిస్ టుడే:భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కోడిపెల్లి గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్మపురి లోని ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా చేసి ఎమ్ ఆర్ ఓ కి వినతి పత్రం సమర్పించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఏదైతే రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం విక్రయించి మూడు నెలలు గడుస్తున్నప్పటికీ ఇంకా చాలామంది రైతులకు డబ్బులు రావడం లేదని వెంటనే రైతులకు సంబంధించిన డబ్బులు రైతుల అకౌంట్లో జమ చేయాలని లేని పక్షంలో రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ రైతు ఉద్యమాన్ని లేవనెత్తి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు ఆరోజు కొనుగోలు ప్రారంభంలో తుకం వేసిన నాలుగు రోజులలోనే డబ్బులు అకౌంట్ లో జమ చేస్తామని ప్రగల్బాలు పలికిన ఈ తెలంగాణ ప్రభుత్వం నాలుగు రోజులు ఏమో కానీ నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ కూడా ఇప్పటివరకు చాలామంది రైతులకు డబ్బులు జమ చేయలేదు కాబట్టి ఇప్పటికైనా వెంటనే రైతులను ఇబ్బంది పెట్టకుండా డబ్బులు జమ చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తున్నది. అదేవిధంగా బీసీ బందు పేరుతో ప్రజలను ఇబ్బంది పెడుతూ కుల ఆదాయ సర్టిఫికెట్లు కావాలని చెప్పేసి ఆఫీసులో రోజుల తరబడి తింపుకుంటున్నారు కాబట్టి వారికి వెంటనే కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీచేసి ప్రతి ఇంటికి లక్ష రూపాయల చొప్పున బీసీ బందు ఇవ్వాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుంది అన్నారు.ఈ కార్యక్రమం లో బీజేపీ మండల, పట్టణ అధ్యక్షులు సంగేపు గంగారాం,బెజ్జరపు లవణ్, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, రాష్ట్ర దళిత మోర్చ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి చెంద్రశేఖర్, కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు బండారి లక్ష్మణ్,ఎంపిటిసి అకుబత్తిని తిరుపతి,జిల్లా కిసాన్ మోర్చ పరిశోధన విభాగం కన్వీనర్ వేముల కరుణాకర్ రెడ్డి,జిల్లా దళిత మోర్చ కార్యదర్శి దొనకొండ నరేష్,సీనియర్ నాయకులు నలమాసు వైకుంఠం,గాజుల రామదాసు,వీరేశం, రాంరెడ్డి,మల్లేశం,మల్కన్న హరీష్,నాగేష్ శర్మతదితరులు పాల్గొన్నారు.

## రాత్రికి రాత్రి గుడిసెలు తొలగించిన అధికారులు..!



పెద్దపెల్లి జిల్లా: (వాయిస్ టుడే న్యూస్): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి శివారులో గల పీకే రామయ్య కాలనీలో సర్వే నం.617 లో శుక్రవారం రాత్రికి రాత్రే కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా గుడిసెలు నిర్మించగా, విషయం తెలుసుకున్న రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ బి సుమన్ రావు, రామగుండం తాసిల్దార్ జాహెద్ పాషా లు శనివారం సంఘటన స్థలం కు చేరుకొని అక్రమ నిర్మాణాలను తొలగింప చేశారు. ఆ సర్వే నంబర్ లోనే ప్రభుత్వ భూమిలో 2007 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం నిరుపేదలకు బట్టలు కూడా పంపిణీ చేసిందని మిగతా ఖాళీగా ఉన్న సీలింగ్ భూమిలో ఇలాంటి నిర్మాణాలు చేపట్టిన, ఆక్రమణలు జరిగిన చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వ సీలింగ్ భూమిలో రాత్రికి రాత్రే చొరబడడంతోపాటు అక్కడ సిపిఐ జెండాలు పార్టీ గుడిసె నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులను గుర్తించి అవసరమైతే బైండోవర్ చర్యలు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కొంతమంది తమ లబ్దికోసం నిరుపేదలను పావులుగా వాడుకుంటూ ఇండ్ల స్థలాలు ఇప్పిస్తామని ఆశ చూపి నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ సీలింగ్ భూమిలో చొరబడి ఎలాంటి అనుమతులు లేకుండా అని అక్రమంగా నిర్మాణాలు చేపట్టడం వల్ల చట్టరీత్యా చర్యలకు బాధ్యులు అవుతారని హెచ్చరించారు.

# విజయవంతమైన కేటీఆర్ పర్యటన



వరంగల్(వాయిస్ టుడే): ఐటీ పరిశ్రమలు పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రూ.618 కోట్ల వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు మధ్యాహ్నం 12 గంటలకు వరంగల్ కోటలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు చేరుకున్నారు అనంతరం తూర్పు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ప్రారంభించారు వరంగల్ సమీకృత జిల్లా కార్యాలయాల కాంప్లెక్స్ కు భూమి పూజ చేశారు దేశాయిపేటలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు జిల్లా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు కొత్తవాడలో కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేతన్నల విగ్రహాలు ఆవిష్కరించారు మండి బజార్ మైనార్టీ డెవలప్మెంట్ ఈద్గా దర్గాలు మసీదుల నిర్మాణం పనులు ప్రారంభం చేశారు వరంగల్ చౌరస్తాలో 16 స్మార్ట్ రోడ్ల ప్రారంభోత్సవంలో పాల్గొని వరంగల్ అధునాతన బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు ఎమ్మెల్యే సోషల్ మీడియా హౌస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు వరంగల్ ఆర్డిఓ జంక్షన్ లో ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు ఉరుసు ఎస్టిపి ప్రారంభోత్సవం చేశారు ఉర్సు రంగలీల మైదానం జి డబ్ల్యూ ఎం సి కి సంబంధించిన పులుసు గుట్ట బండ్ ప్రాజెక్ట్ పట్టణ ప్రగతి డెవలప్మెంట్ వర్క్స్ కుడా కల్చరల్ డెవలప్మెంట్ సెంటర్ కు శంకుస్థాపన చేశారు ఉరుసు దర్గా సందర్శన దర్గా రెన్యూవేషన్ వర్క్స్ కు రంక్షపేట వద్ద కూడా చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు ఇలా వరంగల్లో ఫెర్టిలైటింగ్స్ ప్రారంభించారు అనంతరం వరంగల్లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు

### కలెక్టర్ భవన నిర్మాణానికి భూమి పూజ

ఓ సిటీ మైదానంలో నిర్మించనున్న వరంగల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయ కార్యాలయ నిర్మాణానికి రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ భూమి పూజ చేశారు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు టిఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్ జిల్లా ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## అడివి శేష్ బాలీవుడ్ చిత్రం

'గూఢచారి' 'మేజర్' 'హిట్–2' చిత్రాల్లో అద్భుతమైన పర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు యువ హీరో అడివి శేష్. ప్రస్తుతం ఆయన 'గూఢచారి–2' చిత్రంలో నటిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం అడివి శేష్ బాలీవుడ్‌లో అడుగుపెట్టబోతున్నారని తెలిసింది. 'మేజర్' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విజయం సాధించడంతో అడివి శేష్ ఉత్తరాదిలో కూడా పేరు తెచ్చుకున్నాడు. ఈ నేపథ్యంలో ప్రముఖ బాలీవుడ్ నిర్మాణ సంస్థ ఆయనతో ఓ యాక్షన్ లవ్‌స్టోరీకి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు ఇప్పటికే పూర్తయ్యాయని, త్వరలో అధికారిక ప్రకటన వెలువడుతుందని చెబుతున్నారు.



## కృత్రిమ మేథస్సు కథ

శ్రవణ్‌రెడ్డి, రియా కపూర్ ప్రధాన పాత్రల్లో దేవాస్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రూపొందిస్తున్న తాజా చిత్రం శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. వాసుదేవ్ పిన్నమరాజు దర్శకత్వంలో శ్యామ్ దేవభక్తుని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి అజయ్ ఘోష్ క్లాప్‌నివ్వగా, సుహాస్ కృష్ణ దేవభక్తుని కెమెరా స్విఛాన్ చేశారు. 'కృత్రిమ మేథస్సు కథాంశంతో భారతదేశంలో రూపొందిస్తున్న తొలి చిత్రమిది. సైన్స్ ఫిక్షన్ రొమాంటిక్ డ్రామాగా ఆకట్టుకుంటుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: అఖిల్‌దేవ్, సంగీతం: సాహిత్య సాగర్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వాసుదేవ్ పిన్నమరాజు.



## ఎన్టీఆర్‌కు జతగా కైరా?

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన కైరా అద్వాని కెరీర్ పెళ్లి తర్వాత కూడా సూపర్ ఫాస్ట్ గా వెళ్తోంది. సిద్ధార్థ మల్హోత్రాను మనువాడిన ఈ భామ... తాజాగా "వార్ –2"లో ఛాన్స్ కొట్టేసింది. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా దర్శకత్వంలో తెరకెక్కుతున్న వార్ –2 లో హృతిక్ రోషన్, మన ఎన్టీఆర్ హీరోలు. ఆర్.ఆర్.ఆర్ తో పాన్ ఇండియా స్టార్ గా మారిన ఎన్టీఆర్ నేరుగా నటిస్తున్న తొలి హిందీ చిత్రం కోసం ఎంపికైన కైరా... ఈ చిత్రంలో ఎవరితో జత కట్టనున్నదో తెలియాల్సి ఉంది!!

## కాంచనమాల కాదు రత్నమాల



పాత్రల ఎంపికలో వైవిధ్యానికి ప్రాధాన్యతనిస్తుంది కథానాయిక అంజలి. గత కొన్నేళ్లుగా ఛాలెంజింగ్ రోల్స్ ఎంచుకుంటూ సత్తా చాటుతున్నది. విశ్వక్‌సేన్ కథానాయకుడిగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ రూపొందిస్తున్న తాజా చిత్రంలో అంజలి కీలక పాత్రలో నటిస్తున్నది. ఈ సినిమాకు కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. శుక్రవారం అంజలి జన్మదినం సందర్భంగా ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో రత్నమాల అనే పాత్రలో కనిపించనుంది అంజలి.'రత్నమాల తన వెనక దాచుకున్న రహస్యమేమిటన్నది ఆసక్తికరంగా ఉంటుంది. యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విశ్వక్‌సేన్ క్రూరమైన పాత్రలో కనిపిస్తారు. ఆయన పాత్ర చిత్రణ కొత్త పంథాలో ఉంటుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: అనిత్ మదాది, సంగీతం: యువన్‌శంకర్ రాజా, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య, దర్శకత్వం: కృష్ణచైతన్య.

## సినిమాలకు గుడ్‌బై?

అగ్ర కథానాయిక కాజల్ అగర్వాల్ త్వరలో సినిమాలకు గుడ్‌బై చెప్పే ఆలోచనలో ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. దక్షిణాది చిత్రసీమలో అగ్ర తారగా వెలుగొందుతున్న ఈ పంజాబీ సుందరి ఖాతాలో భారీ విజయాలున్నాయి. 2007లో 'లక్ష్మీ కల్యాణం' చిత్రం ద్వారా తెలుగు ఇండస్ట్రీలో అరంగేట్రం చేసిన కాజల్ అగర్వాల్ వరుస అవకాశాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఇప్పటివరకు 55కు పైగా చిత్రాల్లో నటించిన ఈ అమ్మడు ఇక సినిమాలకు రిటైర్మెంట్ ప్రకటించనుందని చెబుతున్నారు.

తన కుమారుడి బాధ్యతలు చూసుకోవడం కోసమే ఆమె ఈ నిర్ణయం తీసుకుందని తెలుస్తున్నది. 'ప్రస్తుతం అంగీకరించిన సినిమాలను పూర్తి చేసిన తర్వాత ఇక విశ్రాంతి తీసుకోవచ్చు' అంటూ ట్విట్టర్‌లో కాజల్ పెట్టిన పోస్ట్ ఆమె రిటైర్మెంట్ వదంతులకు మరింత బలం చేకూర్చుతున్నది. ప్రస్తుతం కాజల్ అగర్వాల్ 'ఇండియన్–2' 'భగవంత్ కేసరి' చిత్రాల్లో నాయికగా నటిస్తున్నది. ఈ సినిమాలు పూర్తయిన తర్వాత తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించవొచ్చని సమాచారం.



## విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీ స్టార్'?



అగ్ర హీరో విజయ్ దేవరకొండ కెరీర్‌లో 'గీత గోవిందం' చిత్రం ప్రత్యేకంగా నిలిచిపోయింది. ఆయనకు ఫ్యామిలీ ఆడియెన్స్‌లో మంచి ఫాలోయింగ్‌ను తెచ్చిపెట్టింది. పరశురామ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా మెప్పించింది. విజయ్ దేవరకొండ–పరశురామ్ కాంబినేషన్‌లో రూపొందిస్తున్న తాజా చిత్రం ఇటీవలే లాంఛనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. దిల్ రాజు నిర్మిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ కథానాయిక. త్వరలో చిత్రీకరణ మొదలు కానుంది. ఈ చిత్రానికి 'ఫ్యామిలీ స్టార్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. కథానుగుణంగా ఈ టైటిల్ బాగుంటుందనేది చిత్రబృందం ఆలోచనగా చెబుతున్నారు. అయితే ఈ విషయమై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రానికి గోపీసుందర్ సంగీతాన్నందిస్తున్నారు.



## గ్యాంగ్‌స్టర్‌తో ఇమ్రాన్ హష్మీ



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్). సుజిత్ దర్శకుడు. డి.వి.వి.దానయ్య నిర్మాత. ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో బాలీవుడ్ స్టార్ ఇమ్రాన్ హష్మీ నటిస్తున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ధృవీకరించింది. బాలీవుడ్‌లో ముద్దుల వీరుడిగా పేరు తెచ్చుకొన్న ఇమ్రాన్.. ఓ దక్షిణాది చిత్రంలో నటించడం ఇదే తొలిసారి. ప్రియాంకా మోహన్ కథానాయిక. తమన్ స్వరాలు అందిస్తున్నారు. మరో పాత్రలో తమిళ నటి శ్రియా రెడ్డిని ఎన్నుకొన్న సంగతి తెలిసిందే. ఇటీవల ముంబైలో కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించారు. 'సాహో' తరవాత సుజిత్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. యాక్షన్ సన్నివేశాలకు పెద్ద పీట వేశారు. త్వరలోనే ఓ కొత్త షెడ్యూల్‌కి శ్రీకారం చుడతారు.